


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 92, పేజీలు - 08

శనివారం, సెప్టెంబర్ 6, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## మీరు బాగా పని చేస్తే నేను
# రెండోసారి సీఎం అవుతా

### గురుపూజోత్సవంలో టీచర్లకు రేవంత్ విజ్ఞప్తి

- గురుపూజోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నాకు స్వార్థం ఉంది.. నేను రెండోసారి సీఎం కావాలనుకుంటున్న రేవంత్
- విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని విమర్శ
- విద్యాశాఖలో సంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రులు చాలా మంది రెవెన్యూ, ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖలని వారి దగ్గర పెట్టుకుంటారు కానీ తాను విద్యా శాఖనునా దగ్గర పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండో సారి గెలవడానికి విద్యా సంస్కరణలే కారణం అని..తాను కూడా విద్యా సంస్కరణలు అమలు చేసి రెండో సారి గెలవాలన్న స్వార్థంతోనే విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నాన్నారు. నేను ఉంటే విద్యా శాఖ బాగుపడుతుందనో, పేద పిల్లలు బాగుపడుతారనో కొందరు నాపై విమర్శలు చేస్తున్నారని, విద్యా శాఖ ఇంకెవరికైనా ఇవ్వాలని విమర్శిస్తున్నారన్నారు. విద్యా శాఖలో సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా పదేళ్లలో విద్యా శాఖ అస్తవ్యస్తమైందన్నారు.కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పి పదేళ్ల గడిచింది మరి అది అమలు జరిగిందా అనేది మీరే ఆలోచించుకోవాలని టీచర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ పల్లెకు జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులేనన్నారు. పదేళ్లుగా టీచర్ల బదిలీలు జరగలేదు 2017 నుంచి టీచర్ల నియామకాలు జరగలేదు, మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేవలం 55 రోజుల్లో 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి చేశామన్నారు. విద్యను లాభసాటి వ్యాపారంగా మార్చుకుని ఆధిపత్యం చెలాయించాలని ఆనాటి పాలకులు ప్రయత్నించారన్నారు.తెలంగాణ పునర్నిర్మాణంలో మీ సేవలు అవసరమని టీచర్లకు రేవంత్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24

2లో..

## భారత్‌కు ఆరు
# ప్రధాన సవాళ్లు

### - సీడీఎస్ చౌహాన్ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశ జాతీయ భద్రతకు సంబంధించి ఆరు కీలక సవాళ్లు ఉన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు దేశం నిరంతరం సిద్ధంగా ఉండాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో యుద్ధాలు కేవలం భూమి, ఆకాశం, సముద్రానికే పరిమితం కావని, బహుముఖ రంగాల్లో పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గోరఖ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లలో చైనాతో పరిష్కారం కాని సరిహద్దు వివాదమే అతిపెద్దదని సీడీఎస్ చౌహాన్ నొక్కిచెప్పారు. "వేయి గాయాలతో భారత్‌ను దెబ్బతీయాలి" అనే పాకిస్థాన్ ప్రాక్సీ యుద్ధ వ్యూహం రెండో ప్రధాన సవాల్ అని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యలు తాత్కాలికమైనవి కావని, నిరంతరంగా

2లో..

# ఈజ్ ఆఫ్ జస్టిస్ కోసం విశాఖలో ఏడీఆర్

### అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సులో సీఎం చంద్రబాబు

- ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలపై చర్చ
- న్యాయం వేగంగా, సులభంగా అందాలన్న సీఎం
- వర్చువల్ హియరింగ్స్, ఈ-ఫైలింగ్ అమలు చేయాలని సూచన
- పాల్గొన్న సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్ధవంతంగా చేరుతుందన్నారు. భారత్ కు మధ్యవర్తిత్వం ద్వారా న్యాయం కొత్త కాదని, తరాలుగా మనకు అందుబాటులో ఉందని సీఎం తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్ధవంతమైన మీడియేటర్ గా వ్యవహరించారని గుర్తుచేశారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్ధంగా మీడియేషన్ ప్రక్రియను

2లో..

## ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ సంస్థ కాదు

### - ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉపరాష్ట్రపతి పదవి సాధారణ రాజకీయ ఉద్యోగం కాదని, అది ఉన్నతమైన రాజ్యాంగబద్ధమైన పదవి అని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆ పదవిలో కూర్చునే వ్యక్తికి న్యాయమూర్తికి ఉండాల్సిన లక్షణాలైన నిష్పక్షపాతం, హేతుబద్ధత, న్యాయమైన వైఖరి తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గౌహతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఉపరాష్ట్రపతి

2లో..

# కారు నడిపేదెలా.?

### పార్టీపై గులాబీ బాస్ పట్టుకోల్పోయారా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ బంధంలో చిక్కుకున్నట్లే కనిపిస్తుంది. తన రక్తం పంచుకుని పుట్టిన వాళ్లే తనకు రాజకీయంగా ఇబ్బందులు పెడుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయత స్థితిలోకి కేసీఆర్ వెళ్లారనే అనుకోవాలి. ఎందుకంటే కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేసినంత మాత్రాన కవిత చేసిన ఆరోపణలు పార్టీని బాగా డ్యామేజీ చేశాయి. ఒకప్పుడు చాణక్యుడిగా, వ్యూహాలను రచించడంలో దిట్టగా పేరు తెచ్చుకున్న కేసీఆర్ కనీసం తన కుటుంబ సభ్యులను కంట్రోల్ చేసుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేగు బంధంతోటే ఆయన కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారని ఖచ్చితంగా అర్థం చేసుకోవచ్చు. మిగిలిన నేతలను పార్టీకి పంపించిన కేసీఆర్ కవిత విషయంలో ఒక అడుగు వెనక్కు వేసినట్లే అవుతుంది.

#### మంచిరోజులని భావిస్తే..

నిజానికి ఇకపై ఏ జరిగే ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్ దే విజయం అని భావించారు. తాను ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉన్నప్పటికీ తనపట్ల ఆదరణ, ఇమేజ్ చెక్కు చెదరలేదని నమ్మారు. కానీ కవిత ఇష్యూతో ఆ నమ్మకం సడలిపోయింది. ఒకవైపు అనారోగ్యం, మరొకవైపు కుటుంబ పరంగా

2లో..

## జాగృతి కూడా
# కవిత చేజారుతోందా.?

### పావులు కదుపుతున్న కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్రసమితి(బీఆర్ఎస్)పై సంచలన తిరుగుబాటు చేసి పార్టీ సస్పెండ్‌కు గురైన కల్వకుంట్ల కవిత ఇప్పుడు తన స్వచ్ఛంద సంస్థ జాగృతి పేరుతో రాజకీయం చేయాలని భావిస్తోంది. అయితే ఈ ఆలోచనలను కూడా ఆదిలోనే తుంచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. శత్రుశేషం ఉండొద్దన్న కారణంతో తన తోడబుట్టిన చెల్లెలు కల్వకుంట్ల కవితపై

2లో..

## ఖైరతాబాద్ గణపతికి
# రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

- 71 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీకి అభినందనలు
- హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గణేశ్ నిమజ్జనానికి ఒకరోజు ముందు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ బడా గణేశ్ ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71

2లో..

# ప్రజల ఆస్తులు దోచిపెడుతున్నారు

### - చంద్రబాబుపై జగన్ ఫైర్



- కమీషన్ల కోసమే కాలేజీల ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపణ
- ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శ
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు వేల కోట్ల బకాయిలు పెట్టారని వ్యాఖ్య
- తాము అధికారంలోకి వస్తే ఈ నిర్ణయాలను రద్దు చేస్తామని ప్రకటన

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఎం నారా చంద్రబాబు నాయుడుపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో ఏపీ కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలను తప్పుబడుతూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ సుదీర్ఘ ట్వీట్

2లో..

# నేను నిత్య విద్యార్థిని

- సిఫార్సు చేసినా సీటు ఇవ్వని చుక్కా రామయ్య నిజాయతీని కొనియాడిన సీఎం
- పదివేల మందికి పరీక్ష పెట్టి వంద మందిని ఐఐటీకి పంపిన ఘనత ఆయనది
- విజయవాడలో జరిగిన గురుపూజోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం
- తనకు స్ఫూర్తినిచ్చిన భక్తవత్సలం మాస్టారును గుర్తు చేసుకున్న చంద్రబాబు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ శిక్షణలో ఒక ప్రభంజనం సృష్టించిన చుక్కా రామయ్య కఠినమైన క్రమశిక్షణ, నిజాయతీ వల్లే తనకు ఆయనంటే అమితమైన గౌరవం ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

2లో..




# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

### స్టంట్లు చేయవద్దని పోలీసులు హెచ్చరికల జారీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గణేష్ నిమజ్జన సందడి ప్రారంభమయింది. శనివారం జరగనున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర కోసం హైదరాబాద్‌లో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 10 లక్షల మంది భక్తులు, 20,000 నుంచి 50,000 గణేష్ విగ్రహాలు ఈ నిమజ్జనోత్సవంలో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఉత్సవాన్ని సజావుగా నిర్వహించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ పోలీసు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ సరస్సు నిమజ్జన కేంద్రంగా ఉండగా, 20 సరస్సులు, 74 కృత్రిమ చెరువులు ఏర్పాటు చేశారు. నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా, ఎన్‌టిఆర్ మార్గ్, సంజీవయ్య పార్క్‌లో 5 అడుగుల కంటే తక్కువ ఉన్న

2లో..



## మీరు బాగా పని చేస్తే నేను రెండోసారి సీఎం అవుతా

లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాష్ట్రంలో ఉన్న 10 వేల పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూల్స్ కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసినవారు. టీచర్లకు జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు మౌళిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యత అప్పగించామని ప్రతీ ఏటా 130 కోట్లు స్కూల్స్ నిర్వహణకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. చదువొక్కటే పేదల తల రాతను, రాష్ట్రం తలరాతను మారుస్తుందన్నారు. టీచర్లు అంటే ఒక కుటుంబ పెద్దగా భావించండి..పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన సమయంలో పిల్లలతో కలసి ఉపాధ్యాయులు భోజనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా తీర్చిదిద్దుదామని ప్రతినబూనుదామని ప్రపంచ దేశాలతో పోటీ పడేలా మన విద్యార్థులను తీర్చిదిద్దుదామన్నారు. తెలంగాణకు ఒక నూతన ఎడ్యుకేషన్ పాలసీ అవసరం ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించేందుకు ఓకే కమిటీని నియమించామని తెలిపారు. పునాది బలంగా ఉన్నప్పుడే ఎన్ని అంతస్తులైనా కట్టొచ్చునని విద్య విషయంలోనూ పునాది బలంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వరల్డ్ బెస్ట్ మోడల్ గా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ను నిర్మిస్తున్నాం నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం 65 ఐటీఐలను టాటా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్ గా ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. విద్యార్థుల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు ఆ భవిష్యత్తును మీ చేతుల్లో పెడుతున్నా మీరు, నేను కలిసి తెలంగాణను పునర్నిర్మించుకుందాం ఇందుకు అందరూ కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులతో కలిసి రేవంత్ భోజనాలు చేశారు.

# భారత్‌కు ఆరు ప్రధాన సవాళ్లు

కొనసాగుతున్నాయని, అందుకే వ్యూహాత్మక సంసిద్ధత అత్యంత అవసరమని ఆయన తెలిపారు. సీడీఎస్ వివరించిన ఇతర సవాళ్లలో పొరుగు దేశాల్లో నెలకొన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక అస్థిరత మూడోదిగా ఉంది. దీనివల్ల బయటి శక్తులు జోక్యం చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతోందని ఆయన అన్నారు. యుద్ధ స్వరూపం పూర్తిగా మారిపోవడం నాలుగో సవాల్ అని, ప్రస్తుతం స్పేస్, సైబర్‌స్పేస్ వంటి రంగాలకు కూడా పోరాటాలు విస్తరించాయని వివరించారు. పాకిస్థాన్, చైనాల అణ్వాయుధ సామర్థ్యాలు ఐదో సవాల్ కాగా, సైనిక టెక్నాలజీలో వస్తున్న వేగవంతమైన మార్పులు ఆరో సవాల్ అని ఆయన పేర్కొన్నారు. ఇదే సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రస్తావిస్తూ, ఆ మిషన్ సమయంలో సాయుధ దళాలకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చారని జనరల్ చౌహాన్ వెల్లడించారు. "మా లక్ష్యం ప్రతీకారం తీర్చుకోవడం కాదు, మా సహనానికి ఒక లక్ష్మణరేఖ గీయడం మాత్రమే" అని ఆయన అన్నారు. ఆ సమయంలో లక్ష్యాల ఎంపిక, దౌత్యపరమైన చర్చల్లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

# కారు నడిపేదెలా.?

పార్టీలో తలెత్తిన విభేదాలు కేసీఆర్ ను మరింత కుంగదీస్తున్నాయనే అనుకోవాలి. ఈ ఘటన కేవలం కుటుంబంతో సరిపోదన్నది ఆయనకూ తెలుసు. భవిష్యత్ లో నేతలు ఎవరూ తనను కేర్ చేయరన్న విషయమూ ఆయనకు అర్థం అయింది. పార్టీ పై పట్టు చేజారిపోతున్నట్లే కనిపిస్తుంది. కఠిన నిర్ణయం తీసుకోలేక.. చూస్తూ ఉండలేక ఫామ్ హౌస్ లోనే గులాబీ బాస్ మదనపడుతున్నాడు.

### కవిత విమర్శలతో..

తెలంగాణలో ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఆటోమేటిక్ గా తన వైపునకు మళ్లుతుందని, విజయం తథ్యమని భావించారు. అందుకే ఆయన అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరు కాకుండా దూరంగా ఉన్నారు. కానీ కల్వకుంట్ల కవిత కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెప్పడంతో ఉన్న ఇమేజ్ అంతా ఒక్కసారిగా పడిపోయింది. హరీశ్ రావు, సంతోష్ రావుల కన్నా కేసీఆర్ కే ఈ విషయంలో ఎక్కువ చెడ్డపేరు వచ్చిందని చెప్పాలి. కల్వకుంట్ల కవితను తొలినాళ్లలోనే కంట్రోల్ చేసి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండకపోవచ్చని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. శృతి మించిపోయే వరకూ వేచి ఉండటంతో జరగాల్సిన నష్టం జరిగిపోయిందని, దీని నుంచి బయటపడటం ఇక కష్టమేనని అంటున్నారు.

### కోటరీ అవాస్తవమే..

నిజానికి కవిత ఆరోపించినట్లుగా కేసీఆర్ ఎవరి మాట వినరు. ఎవరో చెబితే ఆయన తన నిర్ణయాన్ని అమలు పర్చే రకం కాదు. తనకంటూ ఒక ఆలోచన ఉంటుంది. ఆ ఆలోచన ప్రకారమే కేసీఆర్ వెళతారు. హరీశ్ రావు కానీ, సంతోష్ రావు కానీ, జగదీశ్ రెడ్డి కానీ ఆయన నిర్ణయాలను అమలు పర్చేవారే. అంతే తప్ప ఆయనను ప్రభావం చేసే శక్తి ఎవరికీ లేదు. అందుకే కవిత చేసిన వ్యాఖ్యల్లో ఆయనను ఎవరో మభ్యపెడుతున్నారని కానీ, లోబర్చుకున్నారని కానీ తెలంగాణ సమాజం భావించే పరిస్థితి ఉండదు. రక్తపు చుక్క పడకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న కేసీఆర్ రక్త సంబంధంతో ఇప్పుడు తన పార్టీకే ముప్పు తెచ్చుకున్నారన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి.

# ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ సంస్థ కాదు

కార్యాలయాన్ని రోజువారీ రాజకీయాలతో ముడిపెట్టి చూడకూడదు. మాటల్లో, చేతల్లో, పనుల్లో నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించే గుణం ఆ పదవికి అవసరం. ఉపరాష్ట్రపతి పదవిపై నాకు ఉన్న అవగాహన ఇదే" అని సుదర్శన్ రెడ్డి వివరించారు. సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆయన బరిలో ఉన్నారు. అయితే, మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయడంపై వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరించారు.

ఈ సందర్భంగా తన గెలుపుపై సుదర్శన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏ పార్టీ కూడా తమ ఎంపీలకు విప్ జారీ చేసే అవకాశం లేదని, సభ్యులు తమ అంతరాత్మ ప్రబోధం మేరకు ఓటు వేయవచ్చని గుర్తుచేశారు. "పార్లమెంటు సభ్యులు, మీడియా, పౌర సమాజం, మేధావులు, రచయితలు, సాంస్కృతిక రంగ ప్రముఖుల నుంచి నాకు లభిస్తున్న స్పందన చూస్తుంటే నా గెలుపు ఖాయమనిపిస్తోంది" అని ఆయన అన్నారు.

తన అభ్యర్థిత్వం ప్రకటించిన ఒక్క రోజులోనే ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు పలువురు స్వతంత్రులు బేషరతుగా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పాత్ర గురించి మాట్లాడుతూ, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించే రాజ్యాంగబద్ధమైన స్వయంప్రతిపత్తి గల సంస్థ అని కొనియాడారు. కులం, మతం, వర్గం, లింగం పేరుతో ఏ ఒక్కరినీ ఎన్నికల ప్రక్రియకు దూరం చేసేందుకు వీల్లేదని అన్నారు. ఓటర్ల జాబితాలో కులం, మతం ప్రస్తావన ఉండకపోవడమే దాని నిష్పక్షపాతానికి నిదర్శనమని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం వంటి శుభ సందర్భంలో, తాను గతంలో పనిచేసిన కర్మభూమి అయిన అసోంకు రావడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

## ఈజ్ ఆఫ్ జస్టిస్ కోసం

# విశాఖలో ఏడీఆర్

నిర్వహించేవారన్నారు. విశాఖపట్నంలో జ్యుడీషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకమని తెలిపారు.ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని, ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయని చంద్రబాబు తెలిపారు.

కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలన్నారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలన్నారు. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలన్నారు. విశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతో పాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్ కు కొత్త వ్యవస్థలు రావాలని పిలుపునిచ్చారు.

ఇప్పటికీ చాలా మంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని దీన్ని మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని అన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ముఖ్యమంత్రి తెలిపారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఈ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందన్నారు.

# జాగృతి కూడా కవిత చేజారుతోందా.?

రాజకీయంగా కఠిన వైఖరి అవలంబిస్తున్నారు.

### కవితపై సస్పెన్షన్ వేటు..

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు, సీఎం కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడు సంతోష్‌కుమార్‌పై కవిత అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో వెంటనే ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ చర్య కేవలం కవితను రాజకీయంగా ఒంటరిని చేయడానికే కాక, ఆమె పార్టీలోని ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో జరిగినట్లు కనిపిస్తోంది. కేటీఆర్, తన తండ్రి కేసీఆర్‌తో కలిసి ఎర్రవలి ఫామ్ హౌస్‌లో సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత, కవిత రాజకీయ కదలికలను అడ్డుకోవడానికి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

### తెలంగాణ జాగృతిపై కేటీఆర్ పట్టు..

తెలంగాణ జాగృతి సంస్థ, కవిత రాజకీయ గుర్తింపుకు ప్రధాన ఆధారంగా ఉంది. అయితే, కేటీఆర్ ఈ సంస్థను కవిత చేతిలో నుంచి లాగేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా, జాగృతి స్థాపనలో కీలక పాత్ర పోషించిన రాజీవ్ సాగర్, రాజారాం యాదవ్, మఠం బిక్షపతి వంటి నేతలను కేటీఆర్ రంగంలోకి దింపారు. ఈ నేతలు హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో కవితపై తీవ్ర విమర్శలు చేశారు. రాజీవ్ సాగర్, జాగృతి సంస్థలో కవితకు ఎలాంటి హక్కు లేదని, సంస్థ బీఆర్ఎస్‌కు అనుబంధంగా ఏర్పడిందని, దాని నిర్వహణకు తమకే అర్హత ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కేటీఆర్ ఆధ్వర్యంలో జాగృతిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో భాగమని స్పష్టమవుతోంది.

### జాగృతిలో చీలిక..

కవిత బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన వెంటనే జాగృతిలో చీలిక రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్ కవితను రాజకీయంగా ఒంటరిని చేయడానికి జాగృతి సంస్థను స్వాధీనం చేసుకోవడం ఒక కీలక అడుగుగా కనిపిస్తోంది. ఈ చీలిక జాగృతి సంస్థ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది. కేటీఆర్ చర్యలు, బీఆర్ఎస్‌లో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి, కవిత రాజకీయ ప్రభావాన్ని పూర్తిగా తగ్గించడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి. జాగృతి సంస్థను స్వాధీనం చేసుకోవడం ద్వారా, కవిత రాజకీయ గుర్తింపును బలహీనపరచడం కేటీఆర్ లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ ఆదేశాలకు కట్టుబడి ఉన్నామని రాజీవ్ సాగర్ వంటి నేతలు చెప్పడం, కేటీఆర్ వ్యూహంలో కేసీఆర్ మద్దతు ఉందనే సంకేతాన్ని ఇస్తోంది. ఈ నేపథ్యంలో, కేటీఆర్ చర్యలు బీఆర్ఎస్‌లో రాజకీయ నియంత్రణను తన చేతిలో ఉంచుకోవడానికి ఒక బలమైన ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.

## ఖైరతాబాద్ గణపతికి

# రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఉత్సవ కమిటీని ఆయన అభినందించారు. తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ నగరంలోనూ ఇలాంటి సౌకర్యం కల్పించలేదని ఆయన పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి ఆటంకాలు లేకుండా భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ నగరం అన్ని మతాలను గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. శనివారం జరగనున్న నిమజ్జన కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో, జాగ్రత్తగా పూర్తిచేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్ బండ్ సహా ఇతర ప్రాంతాల్లో నిమజ్జనం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని ఆయన వెల్లడించారు. ఆగస్టు 27న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి పూజతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 'విశ్వశాంతి మహాశక్తి గణపతి' పేరుతో 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో మట్టి, స్టీల్, వరి పొట్టుతో రూపొందించిన ఈ భారీ విగ్రహాన్ని దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గురువారంతో స్వామివారి దర్శనం ముగిసింది. ప్రస్తుతం, ఈ భారీ విగ్రహాన్ని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు అధికారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# ప్రజల ఆస్తులు దోచిపెడుతున్నారు

చేశారు. సంపద సృష్టిస్తానని ఎన్నికలకు ముందు కబుర్లు చెప్పి చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆస్తులను పప్పుబెల్లాల మాదిరిగా తనవారికి పంచిపెడుతున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను గురువారం నాటి మంత్రివర్గ సమావేశంలో ప్రైవేటు పరం చేయడం అవినీతికి నిదర్శమని వైఎస్ జగన్ మండిపడ్డారు. ఈ నిర్ణయం రాష్ట్రానికి శాశ్వతంగా చేస్తున్న అన్యాయమని చంద్రబాబు చరిత్రహీనుడిగా నిలిచిపోతారని వైఎస్ జగన్ విమర్శించారు.1923 నుంచి 2019 వరకూ రాష్ట్రంలో పద్మావతి అటానమస్ కాలేజీని కలుపుకుని 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు. 2019కి ముందు 3 దఫాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా పెట్టారా అని జగన్ ప్రశ్నించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పెట్టిన 17 కాలేజీల్లో 5 చోట్ల కాలేజీలు పూర్తై, క్లాసులు కూడా ప్రారంభం అయ్యాయని ఎన్నికలు ముగిశాక మరోచోట అడ్మిషన్లు కూడా జరిగాయని జగన్ ట్వీట్ చేశారు. మిగిలిన పనులను ప్రభుత్వం బాధ్యతగా ముందుకు తీసుకెళ్లి ఉంటే, 2024లో మరో 5, ఈ ఏడాది మరో 7 కాలేజీల్లో కూడా క్లాసులు ప్రారంభమయ్యేవని అన్నారు. అలా చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. ప్రస్తుతం ఈ కాలేజీలు రావడంతో.. ఆ ప్రాంతంలో అమాంతంగా విలువ పెరిగిన ఆ కాలేజీల భవనాలు, భూములు కొట్టేయడానికి చంద్రబాబు ఇలా ప్లాన్ చేశారంటూ వైఎస్ జగన్ ఆరోపించారు.మరోవైపు రాష్ట్రంలోని పేద కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్న నిర్ణయంపైనా వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఆరోగ్యశ్రీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటుకు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 95 శాతం కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం జరిగిందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం చెప్తున్న ఇన్సూరెన్స్ పథకం పరిధి రూ.2.5 లక్షలకేనా లేక రూ.25 లక్షలకా అని ప్రశ్నించారు. 3257 ప్రొసీజర్లు అంటే, ఆపరేషన్ల ఖర్చు రూ.25 లక్షలదాకా ఉచితం అంటే ప్రభుత్వం కట్టాల్సిన ప్రీమియం రూ.5వేల కోట్లు దాటుతుందన్న వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీ కింద రూ.3,600 కోట్లు ఖర్చు చేయడానికే మనసు లేనివారు, రూ.5వేల కోట్లు ప్రీమియంగా ఖర్చు చేస్తారా అని ప్రశ్నించారు."ఒక బాధ్యతగా ప్రభుత్వం చేసే పనికీ, ప్రైవేటు కంపెనీలు చేసే పనికీ తేడా ఉంటుంది కదా చంద్రబాబుగారూ. దేశంలో అనేక ఆరోగ్య బీమా సంస్థల నుంచి క్లెయిముల పరిష్కారంలో వస్తున్న ఇబ్బందులు తెలియనివా.? లాభాలు లేకుండా వారు ఇన్సూరెన్స్ వ్యాపారం చేస్తారా.? కోవిడ్ లాంటి మహమ్మారి వచ్చినప్పుడు అన్ని ఆరోగ్య బీమా కంపెనీలు, ప్రైవేటు ఆస్పత్రులు చేతులెత్తేస్తే, రాష్ట్ర ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందించింది. ఇప్పుడు అలాంటి వెసులుబాటు ఉంటుందా.? చికిత్సల జాబితాలో లేకపోయినా, ఏ కొత్త వ్యాధి అయినా ప్రభుత్వం తన విచక్షణాధికారాన్ని వినియోగించుకుని వెంటనే ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించే అవకాశాన్ని ప్రజలు ఇప్పుడు కోల్పోతారు కదా? కేవలం ప్రీమియం పేరిట మీ మనుషులకు చెందిన కంపెనీలకు దోచిపెట్టడానికి మీ ఈ నిర్ణయాలంటున్న ఆరోపణలకు, మీ సమాధానం ఏంటి?" అంటూ జగన్ ప్రశ్నించారు. పాపాలు చేస్తున్న చంద్రబాబును ప్రజలు క్షమించరన్న వైఎస్ జగన్, ఇప్పటికే ప్రజల్లో ఆగ్రహం మొదలైందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఈ నిర్ణయాలను రద్దుచేస్తామని ప్రకటించారు. ఈ కాలేజీలను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తెచ్చుకుంటామని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం సంతోషం



**శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్)** ఏఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రేవంత్ ముదిరాజ్ సెప్టెంబర్ 5న నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో అపారమైనవి అని అన్నారు.రేవంత్ ముదిరాజ్ మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం వెనుక ఉన్న మహత్తును గుర్తుచేశారు. డాక్టర్ రాధాకృష్ణన్ ఒక గొప్ప విద్యావేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు, దేశానికి స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషి పట్ల గౌరవాన్ని ప్రదర్శించే ఆలోచనతోనే ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. అలాగే విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, పురోగతి సాధ్యమని పేర్కొంటూ, విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యం, విలువలను నాటే ఉపాధ్యాయులు దేశ అభివృద్ధికి మార్గదర్శకులని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రేవంత్ ముదిరాజ్ ని సన్మానం చేస్తూ, ఏ ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు.

# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

చిన్న విగ్రహాల కోసం బేబీ పాండ్స్ సిద్ధం చేశారు. 69 అడుగుల ఖైరతాబాద్ గణేష్ విగ్రహం నిమజ్జనం కోసం ప్రత్యేక సూపర్ క్రేన్ నెంబర్ 4 ఏర్పాటు చేశారు. ఈ శోభాయాత్ర సెప్టెంబర్ 6న ఉదయం 7 గంటలకు ఖైరతాబాద్ నుంచి ప్రారంభమై, టెలిఫోన్ భవన్, సచివాలయం, తెలుగు తల్లి ఫ్లైఓవర్, ఎన్‌టిఆర్ మార్గ్ గుండా 2.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకుంటుంది. ఉదయం 10:30 నాటికి విగ్రహం సరస్సు వద్దకు చేరుకుని, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 403 క్రేన్లు 134 స్థిర క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు నగరవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 56,187 తాత్కాలిక లైట్లు, 9 బోట్లు, 200 మంది ప్రొఫెషనల్ ఈతగాళ్లు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బృందాలు హుస్సేన్ సాగర్ వద్ద సిద్ధంగా ఉన్నాయి.నిమజ్జనోత్సవం సజావుగా జరిగేందుకు 30,000 మంది పోలీసులు, 733 సీసీటీవీ కెమెరాలు, 160 గణేష్ యాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. బాలాపూర్ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్ బండ్ గుండా హుస్సేన్ సాగర్‌కు చేరుకుంటుంది. చార్మినార్ వద్ద మక్కా మసీదు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌లు బాలాపూర్ రూట్‌ను సందర్శించి, చార్మినార్, ఎంజే మార్కెట్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, పీపుల్స్ ప్లాజా వద్ద ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులు వ్యక్తిగత వాహనాలకు బదులు ప్రజా రవాణా మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సులు ఉపయోగించాలని పోలీసులు సూచిస్తున్నారు. పార్కింగ్ కోసం ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధ భవన్ వెనుక, ఆదర్శనగర్, బీఆర్కే భవన్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ వద్ద ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు అమలవుతాయని, భక్తులు బారికేడ్లు, వాలంటీర్ల సూచనలు పాటించాలని అధికారులు కోరారు. జీహెచ్‌ఎంసీ 4,000 మంది సిబ్బందిని మూడు షిఫ్ట్‌లలో నియమించింది, 14,486 మంది సానిటేషన్ వర్కర్లు శుభ్రత కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఫోకస్ లైట్లు, మొబైల్ టాయిలెట్లు భక్తుల సౌకర్యం కోసం ఏర్పాటు చేశారు. 13 కంట్రోల్ రూమ్‌లు పోలీసుల సహకారంతో నడుస్తాయి.

# నేను నిత్య విద్యార్థిని

ఆయన ఎంపిక ప్రక్రియలో ఎంత పారదర్శకంగా, కఠినంగా ఉండేవారంటే, తాను సిఫార్సు చేసినా సీటు ఇవ్వడానికి నిక్కచ్చిగా నిరాకరించారని గుర్తు చేసుకున్నారు. విజయవాడలో గురుపూజోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చుక్కా రామయ్య శిక్షణా విధానం గురించి చంద్రబాబు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఆయన ఐఐటీ కోచింగ్ కోసం పదివేల మందితో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తే, కేవలం వంద మందిని మాత్రమే ఎంపిక చేసుకునేవారు. ఆ వంద మందిని ముందుగా బాసరకు తీసుకెళ్లి, గోదావరి నదిలో స్నానం చేయించి, మూడు రోజుల పాటు ధ్యానం చేయించేవారు. మానసికంగా వారిని సిద్ధం చేశాక హైదరాబాద్‌కు తీసుకొచ్చి శిక్షణ ఇచ్చేవారు. అలా శిక్షణ పొందిన వందకు వంద మంది ఐఐటీలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దేవారు. అలాంటి వ్యక్తి దగ్గర సిఫార్సులు పనిచేయవు. ఆయన నిబద్ధతే ఆయనకు అంతటి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది" అని చంద్రబాబు వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయుల పాత్ర సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని సీఎం అన్నారు. తన జీవితంలో ఉపాధ్యాయులను ఎప్పటికీ మరచిపోలేనని, విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసి, వారిలో స్ఫూర్తి నింపేది గురువులేనని కొనియాడారు. తన విద్యార్థి దశలో భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు తనకు స్ఫూర్తిగా నిలిచారని, ఆయన వల్లే తాను ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. "నేను ఇప్పటికీ నిత్య విద్యార్థినే. ప్రతి రోజూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటూనే ఉంటాను" అని ఆయన అన్నారు. తన కుమారుడు నారా లోకేశ్ చదువు విషయంలో తన భార్య భువనేశ్వరి పూర్తి శ్రద్ధ తీసుకున్నారని, ఆ క్రెడిట్ అంతా ఆమెకే చెందుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో ఉపాధ్యాయుల బదిలీలు జిల్లా పరిషత్ ఛైర్మన్ల చేతుల్లో ఉండి అనేక విమర్శలకు తావిచ్చేవని, ఆ విధానాన్ని మార్చి పారదర్శకత కోసం తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రవేశపెట్టానని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ విషయంలో ఎలాంటి జాప్యం ఉండదని, డీఎస్సీ నోటిఫికేషన్లను సకాలంలో ఇచ్చి నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, "తల్లికి వందనం" పథకంతో విద్యార్థులకు అండగా నిలుస్తోందని, ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు.

## దమ్మాయిగూడలో

# కాణిపాకం శోభ

- భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న వినాయక మండపం
- కనులపండువగా కాణిపాకం గణపతి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**దమ్మాయిగూడ (ప్రశ్న న్యూస్)** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా జరుగుతున్నాయి. న్యూ కుందానపల్లి ఆరవ వార్డ్‌లోని సాయిరత్న ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన కాణిపాకం వరసిద్ధి వినాయకుడి మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని గణనాథుడిని కనులారా దర్శించుకున్న అనుభూతిని కలిగించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దడం ఇక్కడి ప్రత్యేకత. శిల్పి కె. రాంప్రసాద్ అద్భుత సృష్టికి, దాత ఆర్. మాధవరావు సహకారం తోడవడంతో, జీవకళ ఉట్టిపడే కాణిపాకం గణనాథుడి ప్రతిమ ఇక్కడ కొలువుదీరింది. ఈ విగ్రహం కాలనీవాసులకే కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు నయనానందాన్ని కలిగిస్తోంది. సాయి రత్న ఎన్‌క్లేవ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.వినాయక చవితి రోజున కాలనీవాసులు, మహిళలు, చిన్నారులు, పాల్గొని సామూహికంగా గణపతి వ్రతాన్ని ఆచరించారు. అర్చకులు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాటి నుంచి ప్రతిరోజూ నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, సామాజిక చైతన్యానికి, సాంస్కృతిక వికాసానికి వేదికగా నిలుస్తున్నాయి. చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రలేఖనం, శ్లోకపఠనం, క్విజ్ వంటి పోటీలను నిర్వహించారు. మహిళలు హారతులు, భజనలతో భక్తిభావాన్ని పెంపొందించగా, రాత్రివేళల్లో భక్తి సంగీత కచేరీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవ వాతావరణానికి మరింత శోభను చేకూర్చాయి. సాయి రత్న ఎన్‌క్లేవ్ వాసులంతా ఒకే కుటుంబంలా కలిసికట్టుగా నవరాత్రులు జరుపుకోవడం అదృష్టంగా బావిస్తున్నారు. ఈ ఉత్సవాల ద్వార సమాజంలో సౌభ్రాతృత్వాన్ని, ఐక్యతను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంమన్నారు. ఉత్సవాల ముగింపు రోజైన చివరి రోజున మహాపూజ, అన్నదానం కార్యక్రమాలను భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అనంతరం శోభాయాత్రతో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతామని నిర్వాహకులు తెలిపారు. సాయిరత్న ఎన్‌క్లేవ్‌లోని ఈ కాణిపాకం గణనాథుడి మండపం దమ్మాయిగూడ ప్రాంతంలోనే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ, భక్తి, ఐక్యత, సాంస్కృతిక సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోంది.

ప్రజాప్రశ్న



## చెక్‌డ్యామ్‌పై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

బోథ్,: ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తాంసి మండలం హస్నాపూర్ గ్రామ శివారులోని చెక్‌డ్యామ్‌పై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు నిండిపోవడంతో అలల వలె ఎగిసిపడుతున్న నీటి ప్రవాహం ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరిస్తోంది. ఈ సుందర దృశ్యాన్ని చూసేందుకు గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల వారు చెక్‌డ్యామ్ వద్దకు చేరుకుంటున్నారు.

### మాజీ సర్పంచ్ భార్యను పరామర్శించిన
## డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు

ఆదిలాబాద్, : లక్ష్మణ్ చందా మండలంలోని బొరిగాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భీమన భార్య పోసాని హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. డాక్టర్లను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పోసాని త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బొరిగాం మాజీ సర్పంచ్ భీమన్న కూడా శ్రీహరి రావుతో పాటు ఉన్నారు.

### ఖానాపూర్ గురుకుల పాఠశాలలో
## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




ఖానాపూర్, : ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ లో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తై బజార్ టెండర్ రద్దు చేయాలి

నిర్మల్, : నిర్మల్ జిల్లాలో తై బజార్ కారణంగా చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఆయన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో మాట్లాడి, పట్టణంలో తై బజార్ టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని ఆదేశించారు. పట్టణంలోని చిన్న వ్యాపారులు ఇకపై వ్యాపార నిర్వహణకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, వారి వ్యాపారాలు సాఫీగా కొనసాగించుకోవాలని సూచించారు.

### ప్రశాంతంగా, వైభవంగా
## జరుపుకోవాలని మాజీ సర్పంచ్ పిలుపు

ఖానాపూర్, : ఖానాపూర్ నియోజకవర్గం, జన్నారం మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనం శోభాయాత్రను ప్రశాంతంగా, అంగరంగ వైభవంగా జరుపుకోవాలని పోనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ కోరారు. వాహనాలపై వెళ్లేవారు రంగులు చల్లవద్దని, విగ్రహాల ఎత్తును బట్టి నిర్దేశించిన దారిలోనే నిమజ్జనానికి వెళ్లాలని సూచించారు. శోభాయాత్ర సమయంలో విద్యుత్ వైర్లతో జాగ్రత్తగా ఉండాలని, చిన్నారులను నిమజ్జనానికి తీసుకువెళ్లకపోవాలని, నిండుగా ఉన్న చెరువులు, నీటి కుంటల్లో నేరుగా దిగి నిమజ్జనం చేయవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు



పెద్దపల్లి,: శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్ నగర్ చౌరస్తా వద్ద సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెసిడెన్షియల్ టీచర్స్ సంఘం, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో వినూత్న రీతిలో నిరసన

కరీంనగర్,: కరీంనగర్ – రేకుర్తి చౌరస్థలో రోడ్ల దుస్థితిపై కోట శ్యామ్ కుమార్ అనే వ్యక్తి నిరసన తెలిపారు. కరీంనగర్ – నిజామాబాద్ నేషనల్ హైవే అధ్వానంగా ఉందని, అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. రోడ్డుపై ఏమీ ధరించకపోయినా ఫైన్లు, జీఎస్టీలు, రోడ్డు టాక్స్ కడుతున్నామని, మరి సరిగా లేని రోడ్లకు అధికారులు తనకు ఎంత ఫైన్ కడతారని ఆయన కలెక్టర్, పోలీస్ కమీషనర్లను ప్రశ్నిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

## రెండు రోజులు గణపతి నిమజ్జనం

జగిత్యాల, : జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్ర, శనివారాల్లో గణపతుల నిమజ్జనం వేడుకలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 340 మండపాల్లో తొలి రోజు 120, రెండో రోజు 220 విగ్రహాలను చింతకుంట చెరువు వద్ద నిమజ్జనం చేస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ రెండు రోజులు పట్టణంలో మద్యం దుకాణాలను మూసివేయనున్నారు.

## శాంతియుతంగా రేషన్ షాప్ బంద్ నిర్వహించారు

కరీంనగర్, : బోయినపల్లిలో రేషన్ డీలర్లు శుక్రవారం శాంతియుతంగా రేషన్ షాప్ బంద్ నిర్వహించారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు నర్సయ్య మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఐదు నెలల కమీషన్ ను ఒకేసారి డీలర్ల ఖాతాలో జమ చేయాలని కోరారు. పాత పద్ధతిలోనే రేషన్ డీలర్లకు ఒకేసారి కమీషన్ ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రేషన్ డీలర్ల హామీలను నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కోప్పుల రాజు, కార్యవర్గ సభ్యులు కట్ట మధు, డీలర్లు సుభాష్, పొత్తూరి సురేష్ బాబు పాల్గొన్నారు.

## గూగుల్ కంటే గురువే మిన్న

రామగుండం, : ప్రస్తుతం ఏదైనా ప్రశ్నకు సమాధానం కావాలంటే గూగుల్ ను సంప్రదిస్తున్నారు. కానీ గూగుల్ కంటే గురువు మిన్న అని అన్నారు ఎన్టీపీసీ రామగుండం దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాల మ్యాథ్స్ టీచర్ కే. అనిత. గణిత పరికరాలు తయారుచేసి విద్యార్థులకు వినూత్న రీతిలో బోధిస్తున్నారు. శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా 2024 ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ నందు పరిశోధనపత్రం సమర్పించినందుకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

### ఖమ్మంలో మహిళలచే
## ఘనంగా కుంకుమ పూజలు



ఖమ్మం, : ఖమ్మం నగరం 53 వ డివిజన్ సహకార నగర్ లో శ్రీ లక్ష్మీగణపతి మండప నిర్వాహకులు నిర్వహించిన వరసిద్ధి వినాయక నవరాత్రులులో భాగంగా శుక్రవారం ఉదయం మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. పూజారి దుగ్గిరాల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన, మంత్రపుష్పములు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పుల్లాభొట్ల శివ సుబ్రహ్మణ్యం, సత్తెనపల్లి రాము, ఈశ్వరి సత్తెనపల్లి శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కారేపల్లి ఆలయ సంతలో
## వేలం దక్కించుకున్న మేకల మహేష్ బాబు

వైరా, : కారేపల్లిలోని శ్రీ వెంకటేశ్వర టెంపుల్ ప్రాంగణంలో ప్రతి ఆదివారం జరిగే సంతలో, శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో కార్యనిర్వహణాధికారి శేషయ్య పర్యవేక్షణలో మేకల మహేష్ బాబు రూ. 6,63,000లకు వేలం దక్కించుకున్నారు. అనంతరం సిబ్బంది వేలం దక్కించుకున్న వారికి శాలువాతో సత్కరించారు.

### మాల మహానాడు ఇన్చార్జిగా
## శ్రీనివాస్ నియామకం

వర్ధన్నపేట, : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పని కల శ్రీనివాస్‌ను మాల మహానాడు ఇన్చార్జిగా నియమించారు. జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఈ నియామకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీవో 99ను పునఃపరిశీలించి, రద్దు చేయాలని, మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 8వ తేదీన తెలంగాణలోని 119 మంది ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించాలని పిల్లి సుధాకర్, శ్రీనివాస్‌కు పిలుపునిచ్చారు.

### నర్సంపేట ఎమ్మెల్యే
## దొంతి మాధవరెడ్డి ఇంట్లో గణనాథుడి నిమజ్జనం



నర్సంపేట,: హనుమకొండలోని నర్సంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాసంలో గణనాథుడి నిమజ్జనం శుక్రవారం వైభవంగా జరిగింది. తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం, ఎమ్మెల్యే కుమార్తె అనన్య రెడ్డి చేతుల మీదుగా పద్మాక్షమ్మగుట్ట చెరువులో విఘ్నేశ్వరుని ప్రతిమను నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి దంపతులు గణనాథుడికి వీడ్కోలు పలికారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం:

భూపాలపల్లి,: భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామంలో విప్లవ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు మాట్లాడుతూ, జీఎస్టీ పన్ను రేట్లను భారీగా తగ్గించడం విప్లవాత్మక పన్ను సంస్కరణలని, ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, కొమురయ్య, దుర్గయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్ నమోదు విషయంలో
## మహిళల మధ్య ఘర్షణ

మహబూబాబాద్, : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద ఆధార్ కార్డు నమోదు విషయంలో ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. క్యూలైన్‌లో నిలబడినప్పుడు వాగ్వాదం తీవ్రమై, ఇద్దరూ నడి రోడ్డుపైనే జుట్టు పట్టుకొని ఒకరినొకరు చెప్పులతో కొట్టుకున్నారు. అక్కడున్నవారు వారిని ఆపడానికి ప్రయత్నించినా గొడవ కొనసాగింది. చివరికి, ప్రజలు జోక్యం చేసుకుని వారిని వేరు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేయబడి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

### చింతల్ తండా బీఆర్ఎస్ నాయకులు
## ఎమ్మెల్యే సమక్షంలో తిరిగి పార్టీలో చేరిక

వరంగల్ వెస్ట్, : చెన్నారావుపేట మండల పరిధిలోని చింతల్ తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అభివృద్ధి పథంలో ప్రతి గ్రామం ముందుకు సాగుతోందని అన్నారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆయన ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్ధన్నపేటలో వీధి కుక్కల దాడి
### 11 మేక పిల్లల మృతి

వరంగల్ ఈస్ట్,: వర్ధన్నపేట పట్టణంలో వీధి కుక్కలు దాడి చేయడంతో 11 మేక పిల్లలు మృతి చెందాయి. బాధితుడు బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం, తన ఇంటి ఆవరణలో షెడ్డులో ఉన్న మేక పిల్లలపై తెల్లవారుజామున వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో దాదాపు రూ. 50 వేల వరకు నష్టం జరిగిందని, అవి పెరిగి పెద్దయితే రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మున్సిపాలిటీ అధికారులు వీధి కుక్కలను నిలువరించాలని ఆయన కోరారు.

### జన్మదిన వేడుకల్లో శుభాకాంక్షలు
## తెలిపిన రాష్ట్ర నాయకులు

మెదక్, : మెదక్ జిల్లా తూప్రాన్ మండల్ మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిరుపతి యాదవ్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్ ఛార్జ్ నీలం మధు, మెదక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సంఘటన కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుల భాగస్వామ్యాన్ని తెలియజేస్తుంది.

## ప్రేమ పెళ్లి వద్దన్నందుకు యువతి సూసైడ్

నర్సాపూర్, : శివ్వంపేట మండలం తాళ్లపల్లి తండాకు చెందిన సక్కుబాయి (21) అనే యువతి, నారాయణఖేడ్‌కు చెందిన కానిస్టేబుల్‌ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెప్పింది. తల్లిదండ్రులు వరసకు అన్న అవుతాడని పెళ్లి వద్దని మందలించడంతో మనస్తాపం చెందిన సక్కుబాయి, ఈ నెల 1న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పూర్వ విద్యార్థుల ఘన సన్మానం
### ఏర్వ మాధవికి అరుదైన గౌరవం

సిద్దిపేట,: సిద్దిపేట జిల్లా చింతమడకలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఏర్వ మాధవిని, సిద్దిపేటకు చెందిన జీ ఎన్ హెచ్ ఎస్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ శ్రీహరి మరియు పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు. ఈ సన్మానం మాధవి సేవలకు గుర్తింపుగా జరుగుతోంది.

### వినాయక నిమజ్జనం
## 9 రాత్రుల ఉత్సవాలు ముగింపు

దుబ్బాక, : వినాయక నవరాత్రి ఉత్సవాలు 9 రాత్రులు పూర్తయిన సందర్భంగా, నేడు వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. దేవాలయంలో ప్రారంభమైన స్వామివారి ఊరేగింపు, పురవీధుల గుండా తిరిగి దేవాలయ ధర్మగుండంలో నిమజ్జనం చేయబడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టంక శాల వెంకటేష్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

### వినాయక నిమజ్జనం..
## రూ. 3.61 లక్షలకు లడ్డూ వేలం

గజ్వేల్, : సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలం పాటలో పోతిరెడ్డిపల్లికి చెందిన జగ్గారి నారాయణరెడ్డి రూ. 3.61 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి లడ్డూ వేలం ధర పెరగడం పట్ల హనుమాన్ యూత్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో
## మాజీ సీఎం కేసీఆర్ గణపతి హోమం

హుస్నాబాద్, : సిద్దిపేటలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్ గణపతి హోమంలో పాల్గొన్నారు. తన సతీమణి శోభతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు ఆయన పూజలో పాల్గొన్నారు. ప్రతి ఏటా వినాయక చవితి నవరాత్రులలో కేసీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కేటీఆర్ గత ఐదు రోజులుగా ఫామ్‌హౌస్‌లోనే ఉంటున్నారు.

### యూరియా కొరతపై
## కాంగ్రెస్, బీజేపీ హైడ్రామా



మహబూబ్‌నగర్,: యూరియా కొరతపై కాంగ్రెస్, బీజేపీలు డ్రామాలాడుతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. నాట్లు వేసి నెల రోజులైనా యూరియా ఇవ్వడం లేదని అన్నారు. యూరియా కొరత లేదని సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని, ఎక్కడ చూసినా రైతుల ధర్నాలు, రాస్తారోకోలు కనిపిస్తున్నాయని ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రోమోర్ సెంటర్‌పై మహిళారైతులు దాడి చేశారన్నారు. సీఎంకు కళ్లుంటే చూడాలని మండిపడ్డారు.

### మహమ్మద్ ప్రవక్త బోధనలు
## సర్వ మానవాళికి ఆదర్శప్రాయం

దేవరకద్ర,: దేవరకద్ర నియోజకవర్గం భూత్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్లో మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జమియా మసీదులో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన ముస్లిం సోదర, సోదరీమణులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పల్లె వదిలి పట్టణం వచ్చిన మట్టి మనుషులు..ఈటెల

- హనుమాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొజ్జ గణపయ్యకు పూజలు చేసిన ఎంపీ ఈటెల
- కలిసి ఉంటే కలదు సుఖం, ఇది నిజం అదే సిద్దిపేట ప్రజల ఐక్యత
- హుస్నాబాద్,సిద్దిపేట్, మనుగునూరు ప్రజలు నాకుటుంబ సభ్యులు
- ఉపాధి కోసం గ్రామాలు వదిలి బోయిన్ పల్లిలో స్థిరపడ్డ కర్షకులుజి
- కులం,మతం,ప్రాంతం కాదు, హనుమాన్ వెల్ఫేర్ నగర్లో ఒక్కటైనా ప్రజలు



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో హనుమాన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన వినాయక దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్.ఆయన మాట్లాడుతూ వినాయక చవితి అనగానే పల్లె,పట్నం తేడ లేకుండ ఉత్సాహం ఉరకలు వేస్తోంది.వీధీ వీధిన గణపతి మండపాలల్లో విద్యుత్ కాంతులతో విరాజిల్లుతుంటాయి.స్వామి పై భక్తి ప్రవృత్తులతో గణపయ్యను వేడుక్కొని విజయం చేకూర్చాలని దండం పెట్టు కుంటారు.ఈ పండుగ రోజు సందర్భంగా ఆధ్యాత్మికమైనదే,అయిన కూడా ప్రస్తుతం కొత్త కొత్త ఆలోచనలతో నెటిజన్లు సాంకేతిక పరిజ్ఞాన శోభను సంతరించుకుంటుంది.

తెలుగు పర్వదినాల్లో టెక్నాలజీ విడదీయరాని బంధంగా మారిపోయింది.ఈ నవరాత్రులను మరింత ఆనందంగా నిర్వహించుకోవడానికి తొడు పడుతుందన్నారు.అలాగే ఓల్డ్ బోయిన్ పల్లి 119 డివిజన్ పరిధిలో ఉన్న హనుమాన్ నగర్ లో హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని వారి ఆహ్వానం మేరకు బిజెపి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సందర్శించి అసోసియేషన్ సభ్యులకు, ప్రజలకు వినాయక నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే హైడ్రా వచ్చిన తర్వాత జరిగిన పరిణామాల గురించి మాట్లాడుతూ ఎన్ని హైడ్రాలు వచ్చినా అడ్డు కట్టలా మీ ముందు ఈటెల ఉంటాడని భరోసా ఇచ్చారు.అనంతరందవినాయక మండపం ముందు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఏనుగుల తిరుపతి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి మాట్లాడుతూ బోయిన్ పల్లి డివిజన్ ప్రాంతంలో బోయిన్ చెరువుకు ఆనుకొని ఉన్న మధ్యతరగతి కుటుంబాలు. గ్రామాలు వదిలి పట్టణం బాట పట్టిన మట్టి మనుషులు. ఉపాధి కోసం మార్కెట్లో కూలీ నాలి చేసుకొని జీవితాన్ని గడుపుతున్నారు.అలాంటి పెద ప్రజల జోలికి ప్రభుత్వం పంపిన హైడ్రా వల్ల ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు.ఆ సమయంలో నేనున్నాను అంటూ మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ యుద్ధప్రాతిపదికన బోయిన్ చెరువు చుట్టూ ఉన్న పిచక గూళ్ళు కట్టుకుని నివసిస్తున్న ప్రజల జోలికి ప్రభుత్వం గానీ, హైడ్రా గాని వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు ఎంపీ ఈటెల.అలాంటి గడ్డు పరిస్థితిలో భుజం తట్టిన ఏకైక నాయకుడు మన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ అన్న అన్న విషయం ఇప్పటికి స్థానికులు మర్చిపోలేదన్నారు బోయిన్ పల్లి డివిజన్ భాజపా నేత ఏనుగుల తిరుపతి.ఆ రోజు హైడ్రా నోటీసులు ఇచ్చిన తర్వాత ఈ ప్రాంతాన్ని మొట్ట మొదట సందర్శించిన నాయకుడు ఈటెల,కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా ద్వారా పేద ప్రజలను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే నీ ప్రభుత్వ భరతం పడతాను అని సవాల్ చేసిన ఆ మదుర క్షణాలు మర్చిపోలేదు!ఇక్కడి ప్రజలకు భరోసా కల్పించిన మొట్టమొదటి వ్యక్తి మన ఎంపీ ఈటెల రాజేందర్ అన్న అనే విషయాన్ని గుర్తు చేసిన తిరుపతి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిల్ మెంబర్ భానుక నర్మద,మల్లికార్జున్, భాజపా సీనియర్ నేత పిట్ల నాగేష్ ముదిరాజ్,డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్,రిజముత్తుల, వి.రఘు,సాయి,రమేష్,శ్యామ్ సుందర్, హర్జీత్ సింగ్, హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోచయ్య,రమేష్ గౌడ్,రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాల నివారణకు అవగాహన అవసరం

- కరీంనగర్ ఎంపీ,కేంద్రమంత్రి : బండి సంజయ్ కుమార్
- "సరైన అవగాహనే సైబర్ క్రైమ్స్ కు నివారణ" పోస్టర్ ఆవిష్కరణ
- సైబర్ నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన దిశగా యువత ముందుండాలి
- సైబర్ సత్యాగ్రహం తెలుగు రాష్ట్రాల కన్వీనర్, యువజన అవార్డు గ్రహీత : గజ్జెల అశోక్



**గంగాధర ( ప్రశ్న న్యూస్)** తెలుగు రాష్ట్రాలలో సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన "సరైన అవగాహనే సైబర్ క్రైమ్స్‌కు నివారణ" అనే పోస్టర్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సైబర్ సత్యాగ్రహం తెలుగు రాష్ట్రాల కన్వీనర్, యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, "ప్రస్తుత డిజిటల్ యుగంలో చిన్న పొరపాటే పెద్ద నష్టానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఎక్కువగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి, ప్రతి పాఠశాలకు చేరాలి" అని అన్నారు.అనంతరంగజ్జెల అశోక్ మాట్లాడుతూ, "సైబర్ నేరాల నుండి రక్షణకు సామాన్య ప్రజలలో అవగాహనే ప్రధాన ఆయుధం. యువత, మహిళలు, ఉద్యోగస్తులు ఇలా అందరికీ ఇది అవసరం. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు యువత ముఖ్య పాత్ర పోషించాలని,పోస్టర్ రూపంలో ప్రామాణికమైన సమాచారాన్ని పోతిరెడ్డి మాధవ రెడ్డి, సైబర్ వారియర్ సహకారంతో అందించేందుకు ముందుకు వచ్చాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజేవైఎం జిల్లా కార్యదర్శి వేముండ్ల కుమార్, జేరిపోతుల పోచయ్య, నర్సయ్య, మహేష్, గజ్జెల నవీన్ కుమార్, అజయ్ జేరిపోతుల, వెంకటేష్ జేరిపోతుల, సతీష్ జేరిపోతుల, చందు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ హర్షం

## మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

- తగ్గించిన జిఎస్టీ మధ్యతరగతి కుటుంబాలకు మోదీ గిఫ్ట్
- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న కీలక నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ వేములవాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మోదీ చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. నిత్యావసరాలు,ఎలక్ట్రికల్, వంట సామగ్రిపై జీఎస్టీ తగ్గించడం మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనమని పార్టీ నేతలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, "మధ్యతరగతి భారాన్ని తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైంది.మధ్యతరగతి కుటుంబాలకు తగ్గించిన జిఎస్టీ మోదీ గిఫ్ట్ గా శ్రీధర్ అభివర్ణించారు.మరోవైపు కేంద్ర నిధులతో జరుగుతున్న పథకాలను కాంగ్రెస్ తమ పేరుతో ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ పార్టీకి సిగ్గుచేటు" అని విమర్శించారు.అనంతరం భాజపా సీనియర్ జిల్లా నాయకులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, "భారతదేశం వంటి అతిపెద్ద దేశంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా జీఎస్టీ తగ్గించడం గొప్ప నిర్ణయం" అన్నారు.ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు రేగుల మల్లిఖార్జున్, పిన్నింటి హనుమన్లు, వాసం మల్లేశం యాదవ్, మెరుగు లక్ష్మణ్, కటకం శ్రీనివాస్, డాక్టర్ వెంకన్న, జవ్వాజీ రాజశేఖర్, నాంపల్లి పరుశరాములు, శేఖర్ బాబు, వివేక్ రెడ్డి, సాయి, రేగుల శ్రీకాంత్, సత్యం, గుడిసె మనోజ్, రాధిక పాల్గొన్నారు.

# సాయి ఎక్సలెంట్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..!



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) మండల కేంద్రంలోని పాపకొల్లు రోడ్డు నందు గల సాయి ఎక్సలెంట్ స్కూల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఆరెబోయిన శారదాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన పుట్టినరోజును జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సమయంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన విధానం ఉపాధ్యాయ వృత్తికి చాలా అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులు రకరకాల ఇబ్బందులను ఎదుర్కొంటూ విద్యా బోధనలు సాగించాల్సి వస్తుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా ప్రాముఖ్యమైనదని, ఉపాధ్యాయులు అందరూ కూడా సమిష్టిగా కృషి చేసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఆరె బోయిన హుస్సేన్, నాగలక్ష్మి, శివ కుమారి, ఉపాధ్యాయులు అశోక్, సత్యవతి, నవీన, అనిత, నవ్య, సరిత, దుర్గ భవాని, సరిత, ప్రశాంతి, వీణ, రమేష్, విజయ, ఉదయభాను, అరుణ, నందిని, విద్య, కళ్యాణి, స్నేహ, పావని, సరోజ, రూప, రుచిత, శిరీష, రామాదేవి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** సామాన్యులపై భారం పడకుండా జీఎస్టీ పైన భారీ తగ్గించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ భారతీయ జనతా పార్టీ మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షులు జెల్లీ శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు జెల్లీ శైలజ హరినాథ్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయంతో జిఎస్టి పైన భారీ తగ్గింపు చేసిన కారణంగా సామాన్యుడికి నిత్యవసర వస్తువుల పైన పన్ను భారం తగ్గిందన్నారు.

పేద ప్రజలకు అండగా ఉండే నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, బిజెపి యల్లంపేట మున్సిపల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు జాకట ప్రేమ్ దాస్,పార్టీ సీనియర్ నాయకులు కిషన్ రావు,పాతూరి సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ నాయకులు బట్టు నాగేశ్వర్ రావు, మున్సిపల్ మాజీ మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి,కిసాన్ మోర్చా మున్సిపల్ అధ్యక్షులు సత్యనారాయణ,నాయకులు బొజ్జ వంశీధర్ రెడ్డి ,మహిళా నాయకురాలు ,పుష్ప మల్లారెడ్డి, నర్సింగ్ రావు, భిక్షపతి, ఎంఆర్పీఎస్ నాయకులు పరుశరామ్,బాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## లైవ్ కిచెన్‌ను ప్రారంభించిన

# రాజకీయ ప్రముఖులు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పై లోటస్ ఎన్ క్లివ్ కి ఎదురుగా ఏర్పాటు చేసిన లైవ్ కిచెన్ మల్టీ క్యూసీన్ రెస్టారెంట్ ను శుక్రవారం మేడ్చల్ ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,ముఖ్య అతిథిలుగా హాజరై రిబ్బన్ కట్ చేసి,జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అతిథులు లైవ్ కిచెన్ యజమానులను ప్రత్యేకంగా అభినందించారు.లైవ్ కిచెన్ యజమానులు రమేష్,జైపాల్ రెడ్డి,నిశాంత్ లు మేడ్చల్ ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తో పాటు అతిథులందరికి శాలువలతో సన్మానించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మేడ్చల్ రోజు రోజు కు అభివృద్ధి చెందుతున్నదని ఇలాంటి రెస్టారెంట్‌ల అవశ్యకత ఉందన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒక సారైనా కుటుంబం తో కలిసి రెస్టారెంట్ కు వస్తారని,వారిని దృష్టి లో ఉంచుకుని లైవ్ కిచెన్ ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఎలాంటి రసాయనాలు వాడకుండా, రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు లైవ్ కిచెన్ ద్వారా అందిస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఆహారపు రంగులు వాడకుండా ఆరోగ్యకరమైన పలు రకాల ఆహార పదార్థాలను అందుబాటు ధరల్లో ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. కస్టమర్ ఆర్డర్ చేసిన వంటకాన్ని వారు అక్కడే ఉండి చూసుకునేలా ప్రత్యక్షంగా కిచెన్ ను ఏర్పాటు చేశారని తెలిపారు.రెస్టారెంట్ యజమానులు మాట్లాడుతూ తమ వద్ద, ఇండిన్, చైనీస్,తందూరి, అన్నిరకాల వెజ్, నాన్ వెజ్ రుచికరమైన వంటకాలు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారుకోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల డైరెక్టర్ శంకర్,సత్య నారాయణ, కౌడే మహేష్,రాకేష్ ,బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్,నరేందర్ రెడ్డి, నరసింహ రెడ్డి,గోపాల్ రెడ్డి, వెంకట నరసింహ రెడ్డి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టీ తగ్గింపుతో మధ్యతరగతి

# కుటుంబాలకు ఊరట

- తగ్గించిన జిఎస్టీ మధ్యతరగతి వారికి మోదీ గిఫ్ట్
- బోయినిపల్లి భాజపా పూర్వ మండల ఉపాధ్యక్షులు : భోగోజి గంగాధర్ చారి



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** భాజపా కేంద్ర ప్రభుత్వం జిఎస్టీ తగ్గించిన నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన బోయినిపల్లి భాజపా పూర్వ మండల ఉపాధ్యక్షులు భోగోజి గంగాధర్ చారి, ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజల భారం తగ్గించేందుకు తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయమైంది. ముఖ్యంగా వ్యాపారవర్గాలు, చిన్న వ్యాపారులు,మధ్యతరగతి వినియోగదారులకు ఇది ఉపశమనం కలిగిస్తుంది. ఇది మధ్యతరగతి కుటుంబాలకు మోదీ గిఫ్టుగా అభివర్ణించారు.ప్రజల అభీష్టాలను గుర్తించి తీసుకున్న ఈ చర్యతో కేంద్ర ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగింది" అని ఆయన అన్నారు.దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడే విధంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజానుకూల నిర్ణయాలు తీసుకోవాలని గంగాధర్ చారి ఆకాంక్షించారు.

# సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న డాక్టర్ రాజగోపాల్

- సాంకేతిక విద్యలో ప్రతిభకు గుర్తింపు - పూర్వ,విశ్రాంత ప్రిన్సిపాల్ కు ఉత్తమ పురస్కారం
- రిటైర్డ్ అయినవారి సేవలను గుర్తించి పురస్కారాలు అందజేయడం హర్షణీయం
- సహచరులకు, ఉన్నతాధికారులకు,విద్యార్థులకు అవార్డును అంకితం చేస్తున్నా
- ఉత్తమ సేవా పురస్కార అవార్డు గ్రహీత : డాక్టర్ బి. రాజగోపాల్



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** గురు పూజోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాదు – శిల్పకళావేదికలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక విద్యా విభాగంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ,విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు.పురస్కారాన్ని స్వీకరించిన అనంతరం డాక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ, "రిటైర్మెంట్ తర్వాత కూడా నా సేవలను ప్రభుత్వం గుర్తించి, పురస్కారాన్ని అందించడం హర్షణీయం.నాకు లభించిన ఈ గౌరవాన్ని నా సహోద్యోగులకు, ఉన్నతాధికారులకు, విద్యార్థులకు అంకితం చేస్తున్నాను.మున్ముందు సైతం విద్యార్థుల విద్యాభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు అందిస్తాను" అన్నారు.సీటీఈ కమీషనర్ దేవసేన,కమిటీ సభ్యులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని డాక్టర్ రాజగోపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి,అధ్యాపకులు, విద్యార్థులు ఉత్తమ సేవా పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ రాజగోపాల్ కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.



# ఘనంగా గణపతి వేడుకలు



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పట్టణ పరిధిలోని ఘనంగా చంద్రనగర్ కాలనీ రోడ్డు నంబర్ ఐదు దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమ్మర్జన వేడుకలు అందరూ కలిసి అడభారంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ డిపో సోషల్ మీడియా ఇంచార్జి ఆనంద్ వారి సతిమణి రూప ఘనంగా ఆ గణపయ్యకి ప్రత్యేకంగా పూజలు నిర్వాయించారు.. ఈ కార్యక్రమం లో యూత్ అసోసియేషన్ సభ్యులు కార్తీక్ సందీప్ విష్ణు ప్రశాంత్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ వెల్ఫేర్ నగర్లో నేతల సందడి



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)దేశ వ్యాప్తంగా చిన్న పెద్ద తేడా లేకుండా అందరు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రధమ పూజ్యుడైన గణపతికి పుజించి ఆనందిస్తారు.వినాయక చవితి వేడుకలు జరపడంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఖైరతాబాద్ వినాయకుడు ప్రత్యేకంగా నిలుస్తుందని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ తెలిపారు.సాధరణంగా హైదరాబాద్లో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.ప్రతి ఇంట్లో గణేషుడిని కొలువు తీర్చి ఆరతులు మేళతాళాలతో ఒక్కటే కోలాహలంగా జరుపుతుంటారు.కానీ మహానగరంలో ఉన్న ఏకైక భారీ వినాయకుడు ఖైరతాబాద్ ప్రాంతంలో నెలకొల్పడంతో వివిధ ప్రాంతాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి గనాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.ఈ నేపథ్యంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో ఉన్న హనుమాన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యకి ప్రత్యేక పూజలు నిర్వహించారు స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్.అలాగే డివిజన్ లో పలు వినాయక మండపాలు తిరుగుతూ గణనాథున్నీ దర్శించుకున్నారు.హనుమాన్వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.పోచయ్య, కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

ఓల్డ్ బోయిన్ పల్లి మల్లికార్జున్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4 మలినేని టవర్స్ – సప్తగిరి రెసిడెన్సిలో గణేశుని పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం పాల్గొన్నారు. అపార్ట్మెంట్స్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య,మనోహర్ యాదవ్, బుర్రి యాదగిరి,చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిగ్మా ఆసుపత్రి వల్ల రోడ్డు పాలైంది

## మా కుటుంబం న్యాయం చెయ్యండి

**- నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు విన్నపం**

**- ఇలాంటి దుస్థితి మరే కుటుంబానికి రావద్దు**




**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** మా కుటుంబాన్ని రోడ్డు పాలు చేసింది సిగ్మా ఆసుపత్రి, మాకు న్యాయం చెయ్యండి అని, ఇలాంటి దుస్థితి మరే కుటుంబానికి రావద్దు అని జగిత్యాల సిగ్మా హాస్పిటల్లో చనిపోయిన బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు విన్నవించుకున్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23న జగిత్యాల పట్టణం గొల్లపల్లి రోడ్ లో గల సిగ్మా హాస్పిటల్లో మృతి చెందాడన్న విషయం పాఠకులకు తెలిసిందే. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్ జి ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ ఆదేశాల మేరకు జిల్లా ఉప వైద్యాధికారి డా. ఎన్ శ్రీనివాస్, మృతుడు బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో విచారణ జరిపారని తెలిపారు. బైరి లక్ష్మణ్ ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరగా వైద్యులు శస్త్ర చికిత్స చేస్తుండగా అతను ఆపరేషన్ థియేటర్ లో మృతి చెందాడని తెలిపారు.అయితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే పేషెంట్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగిన విషయం పాఠకులకు తెలిసిందే.సిగ్మా హాస్పిటల్ లో చనిపోయిన కుటుంబాన్ని 2025 ఆగస్టు 24 న ఎన్ హెచ్ ఆర్ సి బృందం పరామర్శించారు. సిగ్మా హాస్పిటల్లో పేషెంట్ చనిపోయిన ఘటన పై దర్యాప్తు జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో, చనిపోయిన బైరి లక్ష్మణ్ కుటుంబానికి న్యాయం జరగాలని, అసలు సిగ్మా హాస్పిటల్లో ఏం మాయ మాఫియా జరుగుతుంది అని ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ ఎవరు? పేషంటు ఎందుకు చనిపోయారు? ఈ సంఘటనపై అన్ని విధాలుగా దర్యాప్తు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో జిల్లా వైద్యాధికారి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కన్వీనర్ డా ప్రమోద్ కు పిర్యాదు చేశారని తెలిపారు.సిగ్మా హాస్పిటల్లో మృతి చెందిన ఘటనపై ఎంక్వైరీలో బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారని తెలిపారు.అయితే ఈ విషయంలో ఎంక్వైరీ అయ్యాక బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు మాకు న్యాయం చెయ్యండి అని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కు విన్నవించుకున్నారని తెలిపారు.

# లక్ష చీర గణపతి దర్శనాలు నిలిపివేత

**విశాఖపట్నం** భక్తి ముసుగులో వ్యాపారానికి తెర లేపిన నిర్వహుకులకి అధికారులు షాక్ ఇచ్చారు. లక్ష చీరల వస్త్ర గణపతి దర్శనాలు నిలిపివేసారు. లక్ష చీరల గాజువాక వస్త్ర గణపతి మండపం నిర్వహుకుల తీరు వివాదాస్పదంగా మారింది.

భక్తీ ముసుగులో కమర్షియల్ టికెట్స్, చీరల కొనుగోలు చెయ్యడానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పోలీసుల అదేశాలు పెడ చెవిన పెట్టీ.. దర్శనం ఫీజు, పార్కింగ్ రుసుము, చీరల అమ్మకాలు జరిపారు నిర్వహకులు. భక్తుల భద్రత, సౌకర్యాల పాటించడంలో డొల్ల తనం ఉందని అధికారులు నోటీసులు జారీ చేసారు. భక్తుల భద్రతకి ప్రమాదం ఉన్న నేపథ్యంలో దర్శనాలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. విద్యుత్ నిలిపి వేసి భక్తులని బయటకి పంపించేసారు

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ ఆర్యవైశ్య సంఘం గత 3 సం,లుగా కుడా గరాదేశ్ కి కాశి నుండి రుద్రాక్షలను తెప్పించి స్వామివారికి మిగతా దేవుళ్లకు గణపతి నవరాత్ర వేయడం జరుగుతోంది. ఈ వినాయక చవితి రోజున 1, 30000 రుద్రాక్ష గజమాలల వినాయకుడికి, వారి కులదేవత్తైన వాసవీ మాతకు గ్రామదేవత గజ్జలమ్మ తల్లికి సమర్పించి 102 హెూమగుండాలను ఏర్పాటు చేసి 408 దూపతులతో గణపతి హెూమం 29న సిద్ధి బుద్ధ సమేత గణపతి కళ్యణం 12 జంటలతో అంగరంగ వైభవంగా స్వామివారి ముందు ఎక్కడా లేని విధంగా జరిపించా రికార్డు సృష్టించారు. ప్రతిరోజు అంటే గణపతి నవరాత్రుల్లో రాత్రి 9 గంటల హారతి అనంతరం స్వామివారికి ప్రసాదం నివేదించి సంఘం సభ్యులంతా కలిసి మేళతాళాలతో ప్రసాద వితరణ భక్తులకు తీయడం. అనవాయితీగా పెట్టుకున్నారు. ఈ కర్యక్రమంలో మ అతిధులుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్,సత్యనారాయణ, రామచంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైశ్యకార్పరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజా కార్పొరేటర్, విజయారెడ్డి, విశిష్ట టెవెలర్సీ పాలభట్ల ఆనంద్ దంపతులు,- సంఘం ముఖ్య సలహాదారు కొంట్ల మల్లిఖార్జున్, ప్రెసిడెంట్ వీరేశం గుప్త, చెక్రటరీ బెందె రాజు, సికాలు, సుంజా నాగమణి, ప్రతిరోజు సంఘం మహిళలు ఉ. 7 గే నుండి 9 గం? వరకు ఆ పాప్రశ్యాము, వాసవిమాత చరిత్ర, విరాష్టకం, హనుమాన్ చాలీసా, గోపిటకామా రాయణం చేయడం జరుగుతోంది. రుద్రాక్షలు ప్రసాదంగా పంచిపెట్టడం జరిగిందన్నారు.




# భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

**- పెద్ద మసీదులో భారీ అన్నదానం, ప్రత్యేక ప్రార్ధనలు**

**- మత సమరస్యానికి ప్రతీక ప్రవక్త జన్మదిన వేడుకలు**

**- టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీమ్**





**గూడూరు (ప్రశ్న న్యూస్)** గూడూరు పట్టణంలోని మసీదులలో గురువారం రాత్రి నుండి తెల్లవారుజాము వరకూ మీలాదున్నబిను పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించారు. జామియా మసీదులో మత గురువు ఖమ్రుల్ ఇస్లాం మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. ఇస్లాం శాంతియుత జీవనానికి మార్గమన్నారు. హింసకు ఇస్లాం లో చోటు లేదన్నారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు సాగించే వ్యక్తులను, పరులను బాధపెట్టే వ్యక్తులను అల్లాహ్ క్షమించదని వివరించారు. ఉదయం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ మీలాదున్నబి మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తారన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని వెయ్యిమందికి పైగా నిరుపేదలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. మత సమరస్యానికి మీలాదున్నబి పండుగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షులు ఎండి. నాజర్, అల్లిహుస్సేన్, మూర్తుజ, అహమద్ భాష, నజిముద్దీన్ ,మహబూబ్ బాషా, షాహుల్, వలి అహ్మద్, కరీముల్లా, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోను

# మహిళల సమస్యకు దొరకని పరిష్కారం..!!

**- జూలూరుపాడులో ఆ ఒక్కటి లేక అతివల అవస్థలు, మరీ దారుణం.. - మహిళల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు. నాయకులు**








జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 05: అటు ఉద్యోగాల్లో ఇటు వ్యాపారాల్లో మగవారితో సమానంగా అన్ని రంగాల్లో ధీటుగా అడుగులు వేస్తున్న మహిళలు పలు సందర్భాల్లో ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు మగవారితో సమానంగా అన్నింట్లో సమాన అవకాశాలు అంటారు. కానీ కనీస అవసరాలు పట్టించుకోరు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలకు పలు అవసరాల నిమిత్తం మండల కేంద్రాలకు వచ్చే ఆడపడుచులకు ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం సమస్యలకు కారణమవుతోంది. అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్న మండల కేంద్రాల్లో అతివలు అవసరానికి ఆ ఒక్కటి కనిపించకపోవడంతో ఎటూ పాలుపోక తిరుగుప్రయాణం కొనసాగిస్తున్నారు. వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలో ప్రభుత్వాలు మారిన, ఎమ్మెల్యేలు మారిన మహిళ కనీస అవసరానికి పరిష్కారం చూపించే దిశా ఎవరు ముందడుగు వేయడం లేదు.

## మండల కేంద్రంలో మహిళల పరిస్థితి మరీ దారుణం.!

వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, వ్యాపారులు, అవసరాల నిమిత్తం ఆడపాదడపా తమ మండల కేంద్రాలలో ఉన్న బ్యాంకులకు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలోని రెవిన్యూ కార్యాలయంలకు, మరో పక్క ఆయా మండల కేంద్రాల్లో ఆసుపత్రులకు వస్తుంటారు.

గ్రామాల నుంచి ప్రజలు జిల్లా కేంద్రంలో పలు క్రయవిక్రయాలు నిర్వహిస్తుంటారు. దాంతో గంటల తరబడి మండల కేంద్రంలో అక్కడే ఉండాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో మహిళలు పడుతున్న ఇబ్బందులు గుర్తించే నాధుడు కరువాయ్యడని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

## ఎమ్మెల్యే సారూ మీరైనా స్పందిస్తారా..!!

గతం గతః కనీసం ఇందిరమ్మ రాజ్యంలో అయినా స్థానిక సమస్యలపై అవగాహనా ఉన్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గెలిచి 20 నెలలు దాటిన మహిళల కనీస అవసరమైన ప్రజా మరుగుదొడ్లు, బస్ షెల్టర్ ల ఏర్పాటు గురించి ఆలోచన చేయాలనీ జూలూరుపాడు నుండి అనునిత్యం పలు ప్రాంతాలకు ప్రయాణం చేసే ఆడబిడ్డలు కోరుతున్నారు. జూలూరుపాడు మండల కేంద్రం నుండి ఖమ్మం కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతోమంది మహిళలు ఉద్యోగరీత్యా, ఆరోగ్య రీత్యా, పలు సమస్యలపై ప్రయాణం చేస్తుంటారు. జూలూరుపాడు మండల కేంద్రంలో ఎటు చూసినా ప్రభుత్వ భూములు ఉన్న దశాబ్దాల కాలం నుండి మహిళల అవసరాల కోసం పబ్లిక్ టాయిలెట్స్, బస్ షెల్టర్లు నిర్మించలేకపోతున్నారు. కారణం మహిళల అవసరాలు గుర్తించలేకపోవడం, ఇందిరమ్మ రాజ్యంలో నైన సరే మహిళల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా మరుగుదొడ్లు, బస్టాండ్ షెల్టర్ ఏర్పాటు చేయాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 108 నైవేద్యాలతో

# గణేశుడికి నివేదన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ లోని రాఘవేంద్ర నగర్ కాలని లో భజరంగి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మహిళలు 108 ప్రసాదాలతో గణేశుడికి నివేదన చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం బజరంగీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బొజ్జ గణపతి మండపంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 108 ప్రసాదాలతో గణేశుడికి నివేదన చేశారు. ఇందులో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం వినాయకుడికి సామూహికంగా ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో బజరంగీ యూత్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# హైప్ పెంచుతున్న హీరోయిన్ పోస్ట్



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చిత్ర శుక్ల 'దక్ష' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెడికల్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మంచు లక్ష్మీ ప్రసన్న, సిద్ధిఖీ, కలెక్షన్ కింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డైమండ్ రత్నబాబు అందించిన కథతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విశ్వంత్, మహేష్, విరేన్, తంబి దొరై, సముద్రఖని, కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మంచు ఎంటర్టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అచ్చు రాజమణి సంగీతం అందిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మూవీ మేకర్స్ హీరోయిన్ చిత్ర శుక్ల పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె 'మిథిలా' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "మిథిలా ముఖం అమాయకంగా కనిపిస్తుంది. కానీ మీరు తెలుసు అనుకున్న.. ప్రతి దాన్ని బద్దలు కొట్టే రహస్యాలతో ఆమె పాత్ర ఉండబోతుంది. ప్రపంచంలో సున్నితమైన స్వరంతో ఉంటుంది. కానీ ఆమె సైలెన్స్‌ను బలహీనతగా పొరపాటు పడకండి. నియమాలను తిరగరాయడానికి 'దక్ష' మీ ముందుకు వస్తోంది" అనే క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రేక్షకుల్లో హైప్ పెంచుతోంది.

# ఉత్తేజకరమైన అధ్యాయం ప్రారంభమవుతుంది..



టాలీవుడ్ స్టార్ హీరో రాజశేఖర్ కూతురిగా శివాత్మిక ఇండస్ట్రీకి పరిచయం అయింది. 'దొరసాని' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. ఇక ఆ తర్వాత పంచతంత్రం, కల్కి, ఆకాశం, రంగమార్తండ, వంటి మూవీస్ చేసింది. అంతేకాకుండా తమిళంలోనూ నటించి శివాత్మిక అనతి కాలంలోనే ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ప్రస్తుతం వరుస సినిమాలు అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. శివాత్మిక త్వరలోనే 'బాంబ్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విశాల్ వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శివాత్మిక రాజశేఖర్, అర్జున్ దాస్ జంటగా నటించారు. దీనిని జెంబ్రియో పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇందులో కాళి వెంకట్, నాసర్, అభిరామి, సింగంపులి, బాలా శరవణన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, శివాత్మిక తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ కొత్త సినిమాను ప్రకటించింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తైనట్లు వెల్లడిస్తూ ఫోటోలు షేర్ చేసింది. ఈ సినిమాలో శివాత్మిక '35 చిన్న కథ కాదు'తో హిట్ అందుకున్న విశ్వ దేవ్ రాచకొండ జత కట్టబోతున్నారు. అదిత్యమండల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం గోల్డ్ బాక్స్ బ్యానర్‌పై చిరు కూతురు సుస్మిత కొనిదెల నిర్మాణంలో రాబోతున్న 7వ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'వరం' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ శివాత్మిక త్వరలోనే ఉత్తేజకరమైన అధ్యాయం ప్రారంభమవుతుందని తెలపడంతో నెటిజన్లు ఆమెకు కంగ్రాట్స్ చెబుతున్నారు. అలాగే హిట్ అందుకోవాలని కోరుతున్నారు.

## సంయుక్త వెరీ స్పెషల్..!



కన్నడ చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు పొందిన సంయుక్తా హెరనాడ్.. సినిమాలతో పాటు ప్రాణుల సంక్షేమం కోసం అద్భుతమైన పనులు చేస్తోంది. ఆమె స్థాపించిన 'ప్రాణా యానిమల్ ఫౌండేషన్' ద్వారా 4000 కంటే ఎక్కువ ప్రాణులను రక్షించి మానవత్వాన్ని చాటుతోంది. సంయుక్తా హెరనాడ్ 2007లో 'ఆ దినగలు' సినిమా నుంచి 2024లో వచ్చిన 'మార్క్స్' వరకు తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఐతే.. నటన తన జీవితంలో ఒక భాగం మాత్రమే. తన అసలైన అభిరుచి ప్రాణుల సంక్షేమం. ఈ దిశగా ఆమె చేస్తున్న పనులు సామాన్యులకు స్ఫూర్తిదాయకం. ఒకరోజు ఒక కాలవలో చిక్కుకున్న కుక్కపిల్లను చూసింది. ఆ పిల్లను రక్షించి 'గుండా' అని పేరు పెట్టి దత్తత తీసుకుంది. ఐతే.. కొంతకాలానికి అది చనిపోయింది. ఆ ఇన్సిడెంట్ తనలో ప్రాణుల పట్ల బాధ్యతను మరింత బలపరిచింది. 'ప్రాణా యానిమల్ ఫౌండేషన్' స్థాపించేలా ప్రేరేపించింది. సంయుక్త ప్రాణా అనిమల్ ఫౌండేషన్‌ను 2022లో స్థాపించింది. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం వీధి ప్రాణులను రక్షించడం, పునరావాసం కల్పించడం, వాటికి ఇళ్లను సమకూర్చడం. బెంగళూరులోని కనకపుర రోడ్డు సమీపంలో ఈ సంస్థ ఒక పిల్లుల పునరావాస, దత్తత కేంద్రాన్ని నడుపుతోంది. వీధిలో తిరిగే, వదిలివేయబడిన పిల్లులకు చికిత్స, శస్త్రచికిత్స అనంతర సంరక్షణ, దత్తత సౌకర్యాలను అందిస్తుంది. ప్రాణా యానిమల్ ఫౌండేషన్ కేంద్రం 2025లో 7వ సీఎంఎస్సీ నేషనల్ అవార్డులలో 'బెస్ట్ యానిమల్ రైట్స్ ఎన్జీఓ'గా గుర్తింపు పొందింది. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 4000 కంటే ఎక్కువ ప్రాణులను రక్షించింది సంయుక్త.

# రజనీకాంత్ క్లాస్ తీసుకోవడం రైటే



ఇటీవలే చెన్నైలో సూపర్ స్టార్ రజనీకాంత్ ని కలుసుకున్న మంచు మనోజ్ తాను విలన్ గా చేసిన మిరాయ్ ట్రైలర్ ని ప్రత్యేకంగా చూపించారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో తిరిగాయి. ఈ సందర్భంగా రజని తనను తిట్టారని, సినిమాలు చేయకుండా ఏం చేస్తున్నావని క్లాస్ పీకారని చెప్పుకొచ్చారు మనోజ్. మోహన్ బాబుతో ఉన్న ఘాడమైన స్నేహం దృష్ట్యా ఫ్రెండ్ కొడుక్కి ఆ మాత్రం మంచి చెడ్డ చెప్పే హక్కు ఖచ్చితంగా తలైవర్ కు ఉంది. అందులోనూ మిరాయ్ లాంటి గ్రాండియర్ లో భాగమవ్వడం చూశాక ఖచ్చితంగా అలా చెప్పకుండా ఎలా ఉంటారు. ఆ విషయాన్ని మనోజ్ స్వయంగా ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. రజని అన్నారని కాదు కానీ మనోజ్ నిజంగానే కెరీర్ మీద సీరియస్ గా ఫోకస్ పెట్టాలి. భైరవం, మిరాయ్ లో విలన్ గా నటించినా సరే ఇప్పటికీ సోలో హీరోగా తనతో సినిమాలు తీసేందుకు నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇటీవలే ఒక అనౌన్స్ మెంట్ రాగా మరొకటి వచ్చే నెల రెడీ చేస్తున్నారు. మార్కెట్ పరంగా చూసుకుంటే మనోజ్ కు ఎప్పుడో పట్టు తగ్గింది. కానీ ప్రేక్షకుల్లో తన మీద ఉన్న సదభిప్రాయం, యూత్ లో ఉన్న గుర్తింపు అవకాశాలు వచ్చేలా చేస్తోంది. దాన్ని సరైన రీతిలో వాడుకోవడమే మిగిలింది. మిరాయ్ ఫాంటసీ సబ్జెక్టు కాబట్టి విలన్ కోణంలో చాలా పెద్ద స్కోప్ దక్కినట్టు ఇన్ సైడ్ టాక్. మంచు ఫ్యామిలీలో వరసగా సినిమాలు చేస్తున్న వాళ్ళు లేరు. మోహన్ బాబు చాలా సెలెక్టివ్ గా మారిపోయారు. విష్ణు కన్నప్ప కోసం చాలా కష్టపడ్డాడు కానీ ఆశించిన ఫలితం పూర్తి స్థాయిలో దక్కలేదు. కొత్త ప్రాజెక్టు ఇంకా అనౌన్స్ చేయలేదు. లక్ష్మిప్రసన్న సైతం అడపాదడపా తప్ప కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మనోజ్ కొంచెం స్పీడ్ పెంచాల్సిన అవసరం చాలా ఉంది అసలే టాలీవుడ్ లో విలన్ల కొరత చాలా ఉంది. ఇక్కడి వాళ్ళు సరిపోక బాలీవుడ్ నుంచి భారీ రెమ్యునరేషన్లు ఇచ్చి దింపాల్సి వస్తోంది. మనోజ్ లాంటి వాళ్ళు ఊపందుకుంటే ఆ లోటు కొంతైనా తీరుతుంది. అందుకే రజనీకాంత్ క్లాస్ పీకడం రైటే.

# లెజెండరీ ఆలోచన వాడుకున్నారు కానీ

ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్ అన్నట్టుంది సుందరకాండ పరిస్థితి. రెండో వారంలోకి అడుగు పెట్టకముందే ఫైనల్ రన్ కు వచ్చేయడం ఎవరూ ఊహించలేదు. ఎందుకంటే ముందు రోజు వేసిన ప్రీమియర్ నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. పాయింట్ టిపికల్ గా ఉన్నా దర్శకుడు బాగానే ఎంటర్ టైన్ చేశాడని రివ్యూయర్లు స్పందించారు. కానీ అది కలెక్షన్లలో కనిపించలేదు. ప్రేక్షకుల అనాసక్తి స్పష్టంగా బయట పడింది. సక్సెస్ మీట్లు చేసినా లాభం లేకపోయింది. విజయ యాత్రను ప్రకటించారు కానీ వాటి తాలూకు ఫోటోలు వీడియోలు బయట పెద్దగా కనిపించలేదు. దీంతో ప్రమోషన్లు ఆపేశారు. నిజానికి సుందరకాండలో తీసుకున్న పాయింట్ టాలీవుడ్ కు కొత్తది కానీ ఈ తరహా ట్రీట్ మెంట్ తో 35 సంవత్సరాల క్రితం ఒక సినిమా తీశారు. అదేంటో చూద్దాం. 1991. సుప్రసిద్ధ దర్శక నిర్మాత యష్ చోప్రా చాందిని లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత లమ్హే చేశారు. విపరీతమైన అంచనాల మధ్య డిజాస్టర్ అయ్యింది. కారణం కథే. అనిల్ కపూర్, శ్రీదేవి ప్రేమించుకుంటారు. కానీ శ్రీదేవి వేరే అతన్ని పెళ్లి చేసుకుని బిడ్డను కన్నాక భర్తతో సహా ప్రమాదంలో చనిపోతుంది. బ్రతికి బయట పడ్డ కూతురు పెద్దయ్యాక మరో శ్రీదేవి అవుతుంది. వయసులో చాలా వ్యత్యాసమున్న అనిల్ కపూర్ నే ఇష్టపడి అతని జీవితంలో అడుగుపెట్టాక స్టోరీ సుఖాంతమవుతుంది. దీన్ని ఆడియన్స్ జీర్ణించుకోలేకపోయారు. తండ్రి సమానుడైన హీరోని చనిపోయిన హీరోయిన్ కూతురు లవ్ చేయడం అంగీకరించలేదు. దీంతో ఫలితం సూపర్ ఫ్లాప్. సుందరకాండలో దీన్ని రివర్స్ చేశారు. కాలేజీలో సీనియర్ శ్రీదేవి విజయ్ కుమార్ ని ప్రేమించిన నారా రోహిత్ ఆమెను మిస్సవుతాడు.




# భగత్ సింగ్ వేగం బాగుందయ్యా



ఎప్పుడు ఏ సమయంలో పవన్ కళ్యాణ్ బిజీ అవుతారో తెలియదు కాబట్టి తనకిచ్చిన బంగారం లాంటి డేట్లను వృథా చేయకుండా దర్శకుడు హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ఏడాది విడుదల లేకపోయినా పోస్ట్ ప్రొడక్షన్ కి ఎక్కువ సమయం కేటాయించి ప్రమోషన్ల కోసం ప్రత్యేక ప్లానింగ్ లో ఉన్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇటీవలే ఒక పాట షూట్ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మొన్న పవన్ పుట్టినరోజుకి విడుదల చేసింది దాని స్టిల్లే. నిజానికి స్టెప్పుతో కూడిన చిన్న వీడియోని వదలాలనే ఆలోచన వచ్చిందట గాని ఓజి ఫీవర్ లో ఉన్న ఫ్యాన్స్ ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక పోస్టర్ తో సరిపెట్టారు. ఇప్పుడు మరో సాంగ్ కోసం రంగం సిద్ధమైపోయింది. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీలో శనివారం నుంచి దీని షూట్ మొదలుపెట్టబోతున్నట్టు సమాచారం. ఇందులో కూడా క్రేజీ నృత్య భంగిమలు ఉంటాయని తెలిసింది. హరీష్ శంకర్ ముందు పలు సవాళ్లున్నాయి. తేరి రీమేకనే ప్రచారం ఉస్తాద్ భగత్ సింగ్ హైప్ మీద తీవ్ర ప్రభావం చూపించింది. ఇప్పుడిది ఒరిజినల్ కథని ఆయన చెబుతున్నారు కానీ తెరమీద చూశాక తప్ప అభిమానులు నమ్మలేని పరిస్థితి. ఇదలా ఉంచితే హైప్ లో పీక్స్ ని చూసిన ఓజి తర్వాత వస్తున్న సినిమాని హరీష్ శంకర్ డైరెక్ట్ చేశారు. సో ఆ హిట్టుని హీటుని అదే రీతిలో కొనసాగించాలి. అందుకే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండేలా స్క్రిప్ట్ లో పలు మార్పులు చేసుకున్న హరీష్ శంకర్ మీద గబ్బర్ సింగ్ రేంజ్ విజయం ఇవ్వాల్సిన అతి పెద్ద బాధ్యత నెత్తి మీద ఉంది. ఇవి కాకుండా మిస్టర్ బచ్చన్ చేసిన గాయం పెద్దదే. రవితేజకో మర్చిపోలేని హిట్టు పడుతుందనుకుంటే పెద్ద డిజాస్టర్ దక్కింది.

## కూతురి కోసం కీలక నిర్ణయం తీసుకున్న అలియా భట్!



బాలీవుడ్ హీరోయిన్ అలియా భట్ తన కెరీర్ విషయంలో ఓ ఆసక్తికరమైన నిర్ణయం తీసుకున్నారు. ఒకవైపు నటిగా బిజీగా ఉంటూనే, కుటుంబానికి కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చే ఆమె, తన గారాల పట్టి రాహా కోసమే ఈ మార్పు చేసుకోబోతున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో తాను నటించే సినిమాల జోనర్‌ను పూర్తిగా మార్చనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటివరకు 'గంగూబాయి కతియావాడి', 'రాజీ' వంటి సీరియస్ చిత్రాలతో నటిగా ఎన్నో ప్రశంసలు అందుకున్న అలియా, ఇకపై తేలికపాటి కామెడీ కథలను ఎంచుకోవాలని భావిస్తున్నట్టు తెలిపారు. దీనికి ప్రధాన కారణం తన కుమార్తె రాహా అని ఆమె పేర్కొన్నారు. "ఇప్పటివరకు నా కూతురు రాహా చూసి ఆనందించే ఒక్క సినిమా కూడా నేను చేయలేదు. అందుకే భవిష్యత్తులో తను చూసి నవ్వుకునేలాంటి ఒక సినిమా ప్రపంచాన్ని సృష్టించాలనుకుంటున్నా. నా కూతురే నా జోనర్ మార్పుకు కారణం. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులను అంగీకరించాను, వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను" అని అలియా వివరించారు. ప్రస్తుతం తన భర్త రణ్‌బీర్ కపూర్‌తో కలిసి 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్న అనుభవాలను కూడా ఆమె పంచుకున్నారు. షూటింగ్, కుటుంబాన్ని బ్యాలెన్స్ చేయడంపై మాట్లాడుతూ.. "మేమిద్దరం షూటింగ్‌లో ఉన్నప్పుడు రాహాను చూసుకోవడం కాస్త సవాలుగా ఉండేది. ఈ సినిమా షూటింగ్ ఎక్కువగా రాత్రి సమయాల్లోనే జరిగింది. దీంతో పగలంతా రాహాతో గడిపి, రాత్రిపూట షూటింగ్‌కు హాజరయ్యాం. కొన్నిసార్లు రాహా సెట్స్‌కు వచ్చి మాతో సరదాగా గడిపేది" అని ఆమె తెలిపారు.

# మరపురాని ప్రయాణం ముగిసింది



బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే, కార్తీక్ ఆర్యన్ కాంబినేషన్‌లో రాబోతున్న మూవీ 'తు మేరి మైన్ తేరా మైన్ తేరా తుమేరీ'. సమీర్ విద్వాన్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ధర్మా ప్రొడక్షన్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అదార్ పూనవల్లా, షరీన్, భూమిక తివారీ, అపూర్వ మెహతా, నిర్మిస్తున్నారు. ఇందులో నీనా గుప్తా కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 13న థియేటర్స్‌లోకి రాబోతుంది.

ఇదిలా ఉంటే.. తాజాగా, అనన్య పాండే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. 'తు మేరి మైన్ తేరా మైన్ తేరా తుమేరీ' షూటింగ్ పూర్తి అయినట్లు వెల్లడించింది. మరపురాని, సరదాగా నిండిన, సూపర్-ఫాస్ట్ రోలర్-కోస్టర్ రైడ్ 57 రోజుల ప్రయాణం ముగిసింది. మా టీమ్ లేకుండా ఈ ప్రయాణం సాధ్యం అయ్యేది కాదు. నాకు ఇష్టమైన షరీన్ మంత్రి, అరోరా కిషోర్ ఎనర్జీలు ముఖ్యమైనవి. అందుకే కరణ్ జోహార్, అపూర్వ మెహతా, అదార్ పూర్ణావాలా ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రత్యేకంగా చేశారు. అద్భుతమైన కోస్టార్‌గా ఉన్నందుకు నా ప్రియమైన కార్తీక్ ఆర్యన్‌కు ధన్యవాదాలు. టిఎంఎంటిలో మీరు చేసిన పాత్రను మరెవరూ చేయలేరు. మీతో కలిసి పనిచేయడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది. పెద్ద తెరపై వారి మాయాజాలాన్ని చూడటానికి వేచి ఉండండి. కరణ్ శర్మకి ప్రత్యేక ధన్యవాదాలు. సినిమా విడుదలైన తర్వాత అతను అందరి కంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుంటాడని నేను అనుకుంటున్నాను. మన ప్రపంచాన్ని అవిశ్రాంతంగా సజీవంగా తీసుకువచ్చి, రాత్రి పగలు అని తేడా లేకుండా పని చేసి ప్రతి ఒక్కరికీ థాంక్స్. మీరందరూ నవ్వడానికి, ప్రేమలో పడటానికి సిద్ధంగా ఉండండి. నేను వేచి ఉండలేను. థియేటర్లలో కలుద్దాం" అని రాసుకొచ్చింది. అలాగే సెట్ ఎంజాయ్ చేస్తున్న వీడియోను షేర్ చేసింది.

### కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను

# వెంటనే అమలు చేయాలి

- 22 నెలలు గడిచినా హామీలు నెరవేరలేదంటూ ఆవేదన
- ఒకరోజు రేషన్ షాప్ బంద్
- కమీషన్ జమ చేయాలని డీలర్ల డిమాండ్
- రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షులు : ఎర్ర నర్సయ్య



**బోయినిపల్లి ( ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల రేషన్ డీలర్లు తమ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం ఒకరోజు రేషన్ షాపులను మూసివేశారు. మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు ఎర్ర నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్ర నర్సయ్య మాట్లాడుతూ "ఐదు నెలల కమీషన్‌ను ఒకేసారి జమ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం, క్వింటాల్ కు రూ.300 కమీషన్ ఇప్పటికీ అమలు కాలేదు. అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా హామీలు నెరవేర్చకపోవడంతో ఈ సమ్మె నిర్వహించాం" అని తెలిపారు.ప్రజా ప్రభుత్వం వెంటనే స్పందించాలని డీలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కోప్పుల రాజు, సభ్యులు కట్ట మధు,సుభాష్, పొత్తూరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మజ్జనానికి సిద్దమవుచున్న బొజ్జ గణపయ్య

- చివరి అంకానికి చేరిన గణేష్ నవరాత్రులు



**సుల్తాన్ బజార్(ప్రశ్న న్యూస్)** వినాయక నవరాత్రుల్లో భాగంగా సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాబాగ్ లోని వీనస్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కుర్మావతార విగ్నేశ్వరుని పూజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు. ఈ నేపద్యంలో మండపంలో కొలువైన విగ్నేశ్వరునికి మురళి (లడ్డు) కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గత పది రోజులుగా నిర్వహించిన బోజ్జ గణపయ్య నవరాత్రుల ప్రత్యేక పూజలు చివరి అంకానికి చేరాయని, శనివారం రోజు మధ్యాహ్నం ప్రత్యేక పూజలు, మహ హరతి అనంతరం, నిమజ్జనానికి ఉసేన్ సాగర్ కు తరలి వెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండప నిర్వాహక పర్యవేక్షకులు శాంత్ కుమార్ తెలిపారు. గత పది రోజులుగా సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాధాలను అందచేస్తున్నామని, గణేష్ నవరాత్రుల ప్రత్యేక పూజలను దిగ్వజయంగా పూర్తి చేసేందుకు తమ సహాయ సహకారాలు అందించిన వీనస్ అసోసియేషన్ సభ్యులకు, భక్తులకు ధన్యవాధాలు తెలిపారు.

### ఆశిష్ ఆర్చిడ్ అపార్టుమెంట్లో

# ఘనంగా గణేష్ పూజలు



నారాయణగూడ(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా నారాయణగూడ లోని ఆశిష్ ఆర్చిడ్ అపార్టుమెంట్ లో వినాయక చవితి నుండి పారంభమైన గణేష్ నవరాత్రుల ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గత గురువారం నాడు కమలేష్ కాశికార్ (న్యాయవాది) కుటుంబ సభ్యులతో కలిసి గణేష్ పూజలలో పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు చింతల రాంచంద్రారెడ్డి, హిమాయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ మహలక్ష్మి రామన్ గౌడ్, జాంబాగ్ డివిజన్ కార్పోరేటర్ రాకేష్ జైస్వాల్, గోషామహల్ డివిజన్ కార్పోరేటర్ లాల్ సింగ్, దయానంద్ మహగౌలి, ప్రసాద్ తదితరులు పాల్గోన్ని ప్రత్యేక పూజలను చేసి అపార్టుమెంట్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులను అభినందించారు.

## భారీ ధర పలికిన మల్లీకార్జున కాలనీ గణపయ్య లడ్డు



బండ్లగూడ జాగీర్(ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రుల్లో భాగంగా బండ్లగూడ జాగీర పరిధిలోని మల్లీకార్జున కాలనీ గణేష్ ఉత్సవ సమితి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో విగ్నేశ్వరుని పూజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారు. గురువారం నాడు జరగిన ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన లడ్డు వేలంలో సాయిరెడ్డి దంపతులు పాల్గోని రూ. 1,31,000 లకు స్వామి వారి లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్బంగా లడ్డును దక్కించుకున్న సాయిరెడ్డి దంపతులను గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, బందు మిత్రులు అభినందించారు.

### ఫ్రెండ్స్ యూత్ గణపతి మండపంలో

# ఘనంగా ప్రత్యేక పూజలు

- 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పణ
- అద్భుతంగా సాగిన ఘనమైన పూజలు- పెద్ద ఎత్తున మహిళల భాగస్వామ్యం
- గణపతి మండపంలో ప్రత్యేక పూజలు - సంపూర్ణ ఆధ్యాత్మిక శోభ



**గంగాధర (ప్రశ్న న్యూస్)** గంగాధర మండలం,మల్లాపూర్,నడింపల్లి గ్రామంలో "ఫ్రెండ్స్ యూత్"ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో శుక్రవారం మహిళలు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీర్వాదం కోసం భక్తిశ్రద్ధలతో మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం 108 రకాల ప్రసాదాల నైవేధ్యాలు సమర్పించి,,వేద మంత్రాల మధ్య సాంప్రదాయ పద్ధతిలో హారతులు ఇచ్చి గణనాథుడిని కీర్తించారు.ఈ కార్యక్రమంలో మహిళలు,యూత్ సభ్యులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తి భావాన్ని వ్యక్తం చేశారు. గణనాథుడి ఆశీస్సులతో క్షేమం,శాంతి, శుభసమృద్ధి కలగాలని కోరుకున్నారు.ఈ నేపథ్యంలో గ్రామమంతా సంపూర్ణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## గణనాథుడి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ అర్బన్ మండలం అనుపురం, కోడుముంజ గ్రామాల్లో వివిధ యూత్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథ మండపాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.అలాగే వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

# గురువుల గౌరవానికి ప్రతీక

## - డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

- మన కాలపు వివేకానందుడు - డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్
- వేములవాడ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు : వికృత్తి లక్ష్మీనారాయణ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** గురువుల మహత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అని వేములవాడ పట్టణ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా బండి మోసి స్టేషన్‌కి తీసుకెళ్లిన గౌరవం పొందిన ఏకైక ఉపాధ్యాయుడు ఆయనే. ఆంధ్ర,బనారస్,ఢిల్లీ విశ్వవిద్యాలయాలకు వైస్‌చాన్సలర్‌గా, ఆక్స్‌ఫర్డ్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా విశిష్ట సేవలందించారు. రష్యాలో రాయబారిగా, స్వతంత్ర భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతిగా ఉన్న రాధాకృష్ణన్‌కి ప్రపంచం మన్ననలు తెలిపింది. తన జయంతినే ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకున్న విశిష్టతకు నిదర్శనమని వేములవాడ పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ వెల్లడించారు.

# మహిళా సాధికారికతపై అవగాహన

## - వేములవాడలో ప్రత్యేక కార్యక్రమం




**వేములవాడ.(ప్రశ్న న్యూస్)** మహిళా సాధికారికత అవగాహన కార్యక్రమంలో భాగంగా, వేములవాడ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజు మాట్లాడుతూ, మహిళా-శిశు సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నంబర్లను వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ వంటగ్యాస్, షీ టీములు, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ క్యాంటీన్లు,ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ పంపులు వంటి పథకాలను విద్యార్థులకు తెలియజేశారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సేఫ్ టచ్-అన్‌సేఫ్ టచ్పై అవగాహన కల్పించారు. అదేవిధంగా, డిజిటల్ టెక్నాలజీ దుర్వినియోగం వల్ల కలిగే సమస్యలు మరియు వాటి నివారణపై సూచనలు ఇచ్చారు.మహిళా సాధికారికత కేంద్రం కోఆర్డినేటర్ బిరోజా వ్యక్తిగత పరిశుభ్రత, మెన్స్ట్రువల్ హైజీన్ ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

### నా గురువు విఠల్ ఆశీస్సులే

# నా ప్రేరణ - నా సంపద

- నమిలిగుండుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు : శ్రీరామోజు శ్రీనివాస్
- గురుశిష్యుల అనుబంధాన్ని తెలిపిన శ్రీనివాస్
- ఒక గురువు - ఇంకో గురువుకి సన్మానం పట్టణంలో అరుదైన ఘటన





**వేములవాడ ( ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో శుక్రవారం ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లగా : వేములవాడ పట్టణానికి చెందిన,వేములవాడ రూరల్ మండలంలోని నమిలిగుండుపల్లి - కొత్తపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామోజు శ్రీనివాస్ శుక్రవారం గురు పూజోత్సవాన్ని పురస్కరించుకొని తన గురువు విఠల్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, " నా గురువు విఠల్ ఆశీర్వాదమే నాకు నిజమైన సంపద. వారి మార్గదర్శకత్వం,ప్రేరణ వల్లే నేడు నేను ఉపాధ్యాయునిగా నిలిచాను" అని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాస్ మిత్రులు ఆయనకు ఘన సన్మానం చేశారు."గురువుల పట్ల గౌరవం చూపినవారే నిజమైన శిష్యులు" అని శ్రీరామోజు శ్రీనివాస్ మిత్రులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.వేములవాడ పట్టణంలో ఒక గురువు ఇంకో గురువును సన్మానించడం అనే అరుదైన ఘటన చోటుచేసుకుంది.ఈ కార్యక్రమంలో తాటికొండ శేఖర్,తోట దేవరాజు,పొలాస చిరంజీవి,పొలాస వాసు, గంగాధర్, మధు,భగవంత్ రావు,శ్రీ రామోజు శ్రీనివాస్,బింగి శ్రీనివాస్, బుట్టం దేవరాజు, దేవీ ప్రసాద్, వేణు, జగన్నాధ చారి,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంపు

- ఉత్తమ భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యం
- గీతా విద్యాలయం పాఠశాల డైరెక్టర్ : రాసమడుగు లింగారావు
- గీతా విద్యాలయంలో ఘనంగా గురు పూజోత్సవం వేడుకలు



**చొప్పదండి (ప్రశ్న న్యూస్)** చొప్పదండి మండల కేంద్రంలోని గీతా విద్యాలయంలో శుక్రవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పాఠశాల డైరెక్టర్ రాసమడుగు లింగారావును విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లింగారావు మాట్లాడుతూవిద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో,ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో గురువుల పాత్ర అమూల్యమని అన్నారు. "ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులను గౌరవించి,వారి సూచనలు పాటించి ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని లింగారావు విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో విద్యార్థులు గురు - శిష్యుల అనుబంధాన్ని తెలిపే నేపథ్యంగల గీతాలు ఆలపించి,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, చూపరులను ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జగిత్యాల ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్‌జెండర్లు : ఎస్పీ అశోక్ కుమార్

- గణేశ్ నిమజ్జనోత్సవం బందోబస్తు లో ట్రాన్స్‌జెండర్లచే ట్రాఫిక్ నియంత్రణ
- హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండవ జిల్లా జగిత్యాల



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనోత్సవం బందోబస్తులో ట్రాన్స్‌జెండర్‌లచే ట్రాఫిక్ నియంత్రణ చేపట్టడం జరిగింది. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి ముఖ్యమైన ప్రజా సేవా కార్యక్రమ బాధ్యతల్లో ట్రాన్స్‌జెండర్‌లను చేర్చిన రెండవ జిల్లా జగిత్యాలగా నిలిచిందని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.గణేశ్ నిమజ్జన బందోబస్తులో ట్రాన్స్‌జెండర్‌లను భాగస్వామ్యం చేయడం వల్ల సమాజంలో ప్రతి వర్గానికీ గౌరవం, మర్యాద, సమానత్వం అందించే మంచి సందేశం వెళ్తుంది అని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. తమదైన జీవనశైలిలో ఉండే వీరికి సమాజంలో వివక్షను పోగొట్టడానికి ట్రాఫిక్ వీధుల్లోకి తీసుకోవడం జరిగింది అని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో 11 మంది ట్రాంజెండర్లు ట్రాఫిక్ విదులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ఇలాంటి బాధ్యతల్లో ట్రాన్స్‌జెండర్‌లను చేర్చిన రెండవ జిల్లా జగిత్యాలగా నిలిచిందని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ ఉన్నారు.

# లక్షల్లో లడ్డూ వేలాలు...
# ఐటీ శాఖ ఎక్కడ..?




- భక్తి పేరుతో బ్లాక్ మనీ ప్రదర్శనా..?
- లక్షల్లో లడ్డూలు కొంటున్న వారికి పై ఇన్కమ్ టాక్స్ ఉండదా..?
- లక్షలు తీసుకుంటున్న మండపాలు డబ్బులు ఏం చేస్తున్నాయి

( ప్రజల పక్షాన "ప్రజా ప్రశ్న దినపత్రిక" ప్రత్యేక కథనం)

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గణేష్ నవరాత్రులు ముగింపుకు వస్తున్న కరుణంలో తెలుగు రాష్ట్రాల్లో భక్తి ఉత్సవం తర్వాత మరో కుతూహలం మొదలవుతుంది అదే లడ్డూ వేలం పాటలు. మొదట భక్తి నిమిత్తం ప్రారంభమైన ఈ సంప్రదాయం, ఇప్పుడు లక్షలు, కోట్లు పలికే ప్రతిష్ఠా పోటీగా మారిపోయింది. కానీ ఈ లక్షల రూపాయల లావాదేవీల వెనుక అసలు కథ ఏమిటి.? అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది.? చట్టబద్ధత ఉందా.? ఐటీ శాఖ ఎందుకు కళ్ళు మూస్తోంది.? అన్న చర్చ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో జోరుగా సాగుతోంది. ఇంత డబ్బు ఎక్కడి నుండి తీసుకు వస్తున్నారని ప్రజల చర్చ వేడెక్కుతోంది.

### రూ.51 లక్షల లడ్డు - మై హోమ్ భుజాలో సంచలనం..

గురువారం మై హోమ్ భుజా గణేష్ మండపం లడ్డూ 51,07,777 లక్షలకు అమ్ముడవడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. అంతకు ముందు పలు మండపాల్లో లడ్డూలు రూ.10 లక్షలు,రూ.15 లక్షలు,రూ. 30 లక్షలు పలికాయి. బాలాపూర్ లడ్డు కూడా అధిక రేట్లకు పలుకుతుంది. ఈ మొత్తాలు చూసి సామాన్య ప్రజలు ఒక్కసారిగా షాక్ అవుతున్నారు "ఒక లడ్డూకి ఇంత ఖర్చు చేస్తే వాళ్ల ఆస్తులు ఎంత.? వాళ్లు ఇన్కమ్ టాక్స్ కడుతున్నారా.? కడితే ఇన్కమ్ టాక్స్ ఎంత కడుతున్నారు.? వాళ్ల ఆస్తులు ఎంత.? ప్రజల్లో తలెత్తిన ప్రశ్నలు దీనిపై ఇన్కమ్ టాక్స్ ఇలాంటి సమాధానం చెబుతుందో.?

### హాట్ టాపిక్ - లడ్డూ వేలాల వెనుక డబ్బు ఎక్కడి నుంచి.?

లక్షల రూపాయల్లో లడ్డూలు కొనుగోలు చేస్తున్నవాళ్లు వాస్తవానికి ఎవరు.? ఈ డబ్బు వైట్ మనీనా.? లేక బ్లాక్ మనీనా.? ఇలాంటి భారీ మొత్తాల లావాదేవీలు ఐటీ శాఖ దృష్టికి వస్తున్నాయా.? వేలం పాటలో వచ్చిన డబ్బు ఎక్కడ వినియోగం అవుతోంది.? ఇలా అనేక సందేహాలు ఇప్పుడు ప్రజలలో కలుగుతున్నాయి వీటిపై చాలావరకు బ్లాక్ మనీ వినియోగం జరుగుతుందని అవినీతి అక్రమాలకు పాల్పడి బ్లాక్ మనీ సంపాదించిన వాళ్లు ఇలా ప్రతిష్టకు వెళ్లి లక్షలు డబ్బులు వెచ్చించడం ఏమిటి.

### ప్రజల డిమాండ్ - ఐటీ శాఖ ఎందుకు నిశ్శబ్దంగా ఉంది.?

లడ్డు కోసం లక్షలలో ఖర్చు చేస్తున్న వాళ్లు రోడ్లపై పూట అన్నం కోసం ఎంతోమంది అభాగ్యులు వేచి చూస్తుంటే రూపాయి ఖర్చు పెట్టారు.

– లేక నిర్వాహకుల వ్యక్తిగత ప్రయోజనాలకా.? ప్రతి మండపం లడ్డూ వేలం పాటలో వచ్చిన డబ్బు వినియోగం పబ్లిక్‌కు తెలియజేయాలి. అప్పుడే వాటిపై ఏర్పడిన అపనమ్మకాలు తొలుగుతాయని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### భక్తి వర్సెస్ ప్రతిష్ఠ -అసలు మార్గం తప్పిందా.?

భక్తి పేరుతో ప్రారంభమైన ఈ సంప్రదాయం ఇప్పుడు పెద్దల ప్రెస్టీజియస్ పోటీగా మారింది. ఎవరు ఎక్కువ ఖర్చు చేస్తే వారికే గౌరవం, ఫోటోలు, పబ్లిసిటీ, మీడియాలో హల్చల్ కానీ ఇది భక్తి



అదే పేదవాళ్లను ఆదరించే ఎన్నో వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలు ఉన్నాయి వాటికి ఒక్క రూపాయి దానం చేయరు. కానీ ప్రతిష్ట పేరుతో ఒక లడ్డుని ఇన్ని లక్షల పెట్టి కొనడం ఎంతవరకు సమంజసము వాళ్ళకే తెలియాలి. భక్తి వేరే, బ్లాక్ మనీ వేరే, ఐటీ శాఖ వెంటనే దర్యాప్తు చేయాలి. లావాదేవీలు బ్యాంక్ ద్వారా జరిగాయా.? లేక నగదులోనా.? వీటిపై పూర్తిస్థాయిలో ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ ఎంక్వయిరీ చేయవలసిన అవసరం చాలా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

### ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్స్ నిపుణుల హెచ్చరిక..

రూ.2 లక్షలకు మించి క్యాష్ ట్రాన్సాక్షన్ చట్టబద్ధం కాదు. లడ్డూ వేలంలో లక్షలు కాష్‌లో చెల్లిస్తే అది నేరం. ఐటీ శాఖకు లడ్డూ వేలం వివరాలు మానిటరింగ్ చేయడం తప్పనిసరి."ఈ డబ్బు మూలం, పన్ను చెల్లింపుల పారదర్శకతను పరిశీలించాలి" అని నిపుణులు సూచిస్తున్నారు.

### వేలం ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడ వినియోగం అవుతోంది.?

- ఆలయ అభివృద్ధికా.?
- సామాజిక సేవకా.?

సంకేతమా.? లేక డబ్బు శక్తి ప్రదర్శనా.?

### చట్టం కళ్ళు మూసుకుంటుందా.?

భక్తి వేషంలో బ్లాక్ మనీ.? చలామణి చేస్తున్నారని నిపుణుల హెచ్చరిక జారీ చేస్తున్నారు.

ఆదాయపన్ను శాఖ పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తే భక్తి పేరుతో బ్లాక్ మనీ చలామణి చేస్తున్న వారి ఆటలు కట్టించవచ్చని సూచిస్తున్నారు. ఈ వ్యవహారం పై ఐటి, ఈడీ దర్యాప్తు తప్పనిసరి. లేదంటే బ్లాక్ మనీకి ఇది పెద్ద వేదిక అవుతుంది.

### ప్రజల డిమాండ్ క్లియర్..

- ఐటి శాఖ వెంటనే విచారణ చేయాలి
- లావాదేవీల పారదర్శకత పబ్లిక్‌కు తెలియజేయాలి
- లడ్డూ వేలం డబ్బు వినియోగంపై మానిటరింగ్ తప్పనిసరి

లక్షల్లో లడ్డూలు కొనడం భక్తి సంకేతమా.? లేక అన్యాయంగా సంపాదించిన డబ్బు ప్రదర్శనా.? సమాధానం కోసం ప్రజలు ఇప్పుడు ఐటీ శాఖ వైపు చూస్తున్నారు.

"లడ్డూ లక్షలు పలుకుతుంది కానీ చట్టం ఎందుకు మౌనం పాటిస్తోంది.?" అన్న ప్రశ్న సమాజం ముందుంది.


## ముఖ్యమంత్రిని కలిసిన యాదగిరిగుట్ట ఈవో వెంకట్రావు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని కార్యనిర్వాహణాధికారి వెంకట్రావ్ మర్యాద పూర్వకముగా కలిశారు. యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వాహణాధికారిగా కొనసాగిస్తూ అవకాశం కల్పించినందులకు కృతజ్ఞతలు తెలియజేశారు.శ్రీ స్వామి వారి శేషవస్త్రం, శ్రీ స్వామి వారి ప్రసాదము ముఖ్య మంత్రి కి కార్యనిర్వాహణాధికారి అందజేశారు.తిరుమల తిరుపతి దేవస్థానము లాగ అద్భుతముగా ఈ దేవాలయమును అభివృద్ధి చేయాలని సూచించారు.ఇందుకొరకు ప్రభుత్వం నుండి అవసరము ఉన్న ఏ అనుమతులైనా, ఉత్తర్వులైనా తీసుకొనుటకు సూచించారు. ముఖ్యమంత్రి సంకల్పము మేరకు ఇట్టి అభివృద్ధి బాధ్యతను తనకు అప్పగించినదులకు గాను ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుచూ ఆలయ అభివృద్ధికి కృషి చేయగలనని వెంకట్రావ్ కార్యనిర్వాహణాధికారి తెలియజేసారు.


## అమెరికా ఒత్తిడిని పట్టించుకోం..
## రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తాం
### తేల్చి చెప్పిన నిర్మలా సీతారామన్

- రష్యా నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తామని స్పష్టం చేసిన కేంద్రం
- దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే తమ నిర్ణయాలు ఉంటాయన్న నిర్మలా సీతారామన్
- ధర, రవాణా సౌకర్యాలే మాకు ముఖ్యమని వెల్లడి
- ఓ ప్రైవేట్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు
- రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధింపు
- ఆగస్టు 27 నుంచే అమల్లోకి వచ్చిన ట్రంప్ ఆంక్షలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో అమెరికా నుంచి వస్తున్న ఒత్తిళ్లకు భారత్ తలొగ్గే ప్రసక్తే లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం స్పష్టం చేశారు. కేవలం దేశ ప్రయోజనాలను, అవసరాలను దృష్టిలో ఉంచుకునే తమ నిర్ణయాలు ఉంటాయని ఆమె తేల్చిచెప్పారు. రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తామని కుండబద్దలు కొట్టారు. ఒక ప్రైవేట్ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ, "విషయం రష్యా చమురు అయినా, మరేదైనా సరే మాకు ఏది అనుకూలంగా ఉంటే ఆ నిర్ణయమే తీసుకుంటాం. ముఖ్యంగా ధర, రవాణా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం. విదేశీ మారక ద్రవ్యం భారీగా ముడిపడి ఉన్న చమురును ఎక్కడి నుంచి కొనాలనేది పూర్తిగా మా అవసరాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, మేము నిస్సందేహంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తాం" అని ఆమె వివరించారు. దేశ దిగుమతుల బిల్లులో అత్యధిక వాటా ముడి చమురుదేనని ఆమె మరోసారి గుర్తుచేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ పరోక్ష ఆర్థిక సాయం అందిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆగస్టు 27 నుంచి భారత్‌పై మొత్తం 50 శాతం దిగుమతి సుంకాన్ని ఆయన విధించారు. ఈ పరిణామాల నేపథ్యంలో నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# అనుమతులు లేకుండా జోరుగా ప్రైవేట్ హాస్టల్స్




- మైసమ్మగూడ పరిధిలో అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో ఏర్పాటు
- రూ.వేలల్లో ఫీజులు... నాణ్యత లేని భోజనం వడ్డింపు - రాత్రివేళలో మచ్చుకైనా కనిపించని భద్రతా చర్యలు
- నిబంధనలు పాటించని నిర్వహకులు - అనుకోని సంఘటన జరిగితే బాధ్యులు ఎవరు.?
- పట్టించుకోని సంబంధిత అధికారులు




"గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని మైసమ్మగూడ ఎడ్యుకేషన్ హబ్ గా మారింది. మెడికల్, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా కాలేజీలు, ప్రైవేట్ విద్యా సంస్థలు విస్తరించాయి. సంవత్సరం సంవత్సరం విద్యాసంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కువ మంది మైసమ్మగూడ, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, మేడ్చల్ కేంద్రంలో ఉండి చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ హాస్టళ్లలో ఉండాల్సి వస్తుంది. దీనిని ఆసరాగా తీసుకోని పదుల సంఖ్యలో ప్రైవేట్ హాస్టళ్లు ఏర్పాటైనాయి. ఏ ఒక్కరు కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా నడిపిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ, ట్రేడ్ లైసెన్స్ వంటివి లేకుండానే అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. ఫీజులను మాత్రం భారీగానే వసూలు చేస్తున్నారు. రాత్రివేళలో భద్రతా చర్యలు మచ్చుకైనా కనిపించవు. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైన అనుకోని సంఘటన జరిగితే బాధ్యులు ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది"



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని మైసమ్మగూడ ఎడ్యుకేషన్ హబ్ గా మారింది. మెడికల్, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా కాలేజీలు, ప్రైవేట్ విద్యా సంస్థలు విస్తరించాయి. సంవత్సరం సంవత్సరం విద్యాసంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కువ మంది మైసమ్మగూడ, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, మేడ్చల్ కేంద్రంలో ఉండి చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ వసతి గృహాల్లో సీట్లు ఇవ్వకపోవడంతో వారు ప్రైవేట్ హాస్టళ్లను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న పలు హాస్టళ్ల నిర్వాహకులు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ప్రైవేట్ హాస్టళ్లను నడిపిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రైవేట్ హాస్టల్స్ కు పూర్తిస్థాయిలో అనుమతులు లేకపోయినా ఇష్టరాజ్యంగా హాస్టల్ నడుపుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫుడ్ సెఫ్టీ, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ, ట్రేడ్ లైసెన్స్ వంటివి లేకుండానే అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. కానీ, ప్రవేట్ హాస్టల్ వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఒక్కో హాస్టల్ లో ఒక్కో రకమైన ఫీజులు :

గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని మైసమ్మగూడలో ఒక్కో హాస్టల్ ఒక్కోలా ఫీజు వసూలు చేస్తున్నారు. డీలక్స్ హాస్టల్, షేరింగ్ రూంలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు ఉండేందుకు, ఉచిత వైఫై, వాషింగ్ మిషన్, హీట్ వాటర్ వంటి వసతులు కల్పిస్తున్నామని ఊదరగొడతున్నారు. దీంతో ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేయడం గమనార్హం. కానీ, ఇందుకు భిన్నంగా అనేక హాస్టళ్లలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, నాసిరకం కూరలు వడ్డిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. హాస్టల్లో ఉండేందుకు ఒక ఫీజు, భోజనం చేసేందుకు ఒక ఫీజు, హాస్టల్లో అందిస్తున్న వసతుల కోసం మరొక ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### హాస్టల్స్ ఎదుట విద్యార్థిని, విద్యార్థుల హల్చల్

గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలో ఎక్కువ సంఖ్యలో బాలుర, బాలికల హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో చాలా హాస్టల్స్ దగ్గర నిర్వాహకులు సరైన భద్రతాపరమైన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. కొన్ని బాలుర, బాలికల హాస్టల్స్ దగ్గర రాత్రి 10 నుంచి 11 గంటల వరకు హల్చల్ చేస్తారని, ఆ సమయంలో కూడా బాలికలు బయటికి వస్తున్నారని తెలుస్తుంది. కొంతమంది బాలికలు రాత్రి ఎక్కువ సమయం బయటికి వచ్చినా పట్టించుకోకుండా తిరిగి హాస్టల్స్ లోకి రానిస్తున్నారని తెలుస్తుంది. ఈ క్రమంలో యాజమాన్యాలు కేవలం ఫీజుల కోసం మాత్రమే హాస్టల్స్ నిర్వహిస్తున్నారని, బాలికల భద్రతను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. దీనికితోడు బాలికల హాస్టల్స్ కేవలం చదువుకునే విద్యార్థినులు మాత్రమే ఉంటున్నారా.? లేక ఇతరులు ఎవరైనా ఉండి వెళ్తున్నారా అనే ప్రశ్నకు సమాధానం ఏ ఒక్కరి వద్ద లేదు. అలాగే ఎవరైనా ఒకరు హాస్టల్లో చేరిన వారం రోజులు ఉండి హాస్టల్ నచ్చక వెళ్లిపోతే నెల రోజులకు సంబంధించిన ఫీజు మొత్తం చెల్లించాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమాచారం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588